
Licenced to Post without Prepayment (AP/VJ-16/WPP/2012-13)

Hotel D.S.R Paradise



Function Hall
- Fully Airconditioned
- 250 seating capacity
- L.E.D lighting
- Ample car parking

అయ్యప్పగుడి సెంటర్, నెల్లూరు.
ఫోన్ : 2354888, 2308666
సెల్: 8008256888, www.dsrparadise.com

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు స్థాపితం: 1930 జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

Longest Living Newspaper in Telugu Journalism

సమీక్షణము

సంపుటి: 82 • సంచిక: 20 • 18-5-2012 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-

మైత్రి డెంటల్ క్లినిక్
- పిప్పిపళ్లకు మరియు విరిగిన పళ్లకు అత్యాధునిక లేజర్‌చికిత్స.
- ఎత్తుపళ్లు, వంకరటింకర పళ్లను సరిచేయు చికిత్స.
- పళ్లు ఊడిపోయిన వారికి కృత్రిమ దంతాలు అమర్చుట.

డా॥ ఎ. నరేంద్రనాథ్, BDS. డెంటల్ సర్జన్
డా॥ శ్రీమతి ఎ. సుసీత, BDS. డెంటల్ సర్జన్
వెంకటరమణ థియేటర్ ఎదురుగా, దర్గామిట్ట, నెల్లూరు.
ఫోన్ : 2341840, 9989100887

జైలుకు వెళ్తేనే లాభమంటున్న జగన్!

జగన్ అక్రమ ఆస్తుల కేసు ఉన్నట్లుండి ఊపందుకొన్నది. మూడు నాలుగు నెలలుగా దీనిపై పెద్ద పురోగతి లేదు. సిబిఐ దృష్టంతా ఎమ్మార్ కుంభకోణం, గాలి జనార్దన్‌రెడ్డి గోల్మాల్ వ్యవహారాల మీదనే కేంద్రీకృతమై ఉండింది ఇంత కాలం. అక్రమ ఆస్తుల కేసులో విజయసాయి రెడ్డి ఒక్కడినే పట్టి పీడిస్తూ ఉండినారు. సమయం మించి పోతున్నదనే భావంతో, రెండు ఛార్జ్‌షీట్లు దాఖలు చేసినా అరెస్టుల జోలికి వెళ్లలేదు. కానీ ఈ వారంలో ఈ కేసుకు ఎక్కడలేని వేగం వచ్చింది. జగన్‌కు కోర్టు సమన్లు పంపారు. మాట్రిక్స్ ప్రసాద్‌ను, ఐఆర్‌టిఎస్ అధికారి బ్రహ్మానందరెడ్డిని జైలుకు పంపారు. సాక్షి బ్యాంక్ ఖాతాలు స్తంభింపజేశారు. సాక్షి ఆస్తులను జప్తు చేసేందుకు కూడా ఉత్తర్వులు విడుదల చేసినట్లు కొన్ని టీవీ ఛానళ్లు వార్తలు ప్రసారం చేస్తున్నాయి. ఈ వార్త వ్రాసే సమయానికి ఈ విషయం నిర్ధారణ కాలేదు. వైఎస్ ఆంతరంగిక బాడీగార్డుగా నలభై ఏళ్లపాటు పనిచేసిన సూరీడు చేత కోర్టులో సాక్షి వాంగ్మూలం ఇప్పించడంలోనూ సిబిఐ సఫలీకృతమైనట్లు వినికిడి. తనపై జగన్ అనుచరులు, అభిమానులు ఎంత ఒత్తిడి తెచ్చినా సూరీడు లెక్క చేయలేదు.

ఈ పరిణామాలు జగన్‌ను ఇరకాటంలో పెడుతున్నాయి. అయితే ఆయన వాటిని ఎదుర్కోవడానికే సిద్ధపడుతున్నాడు తప్ప వెనుకంజ వేయడం లేదు. తనను సిబిఐ అధికారులు జైలుకు పంపితే, జనంలో తన పట్ల సానుభూతి మరింత అధికమై, ఎన్నికలలో ఘన విజయాలు నమోదౌతాయన్నది ఆయన అంచనా. అందువల్లనే తాను జైలులో ఉన్నా పార్టీ నిర్వహణకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లూ చేస్తున్నాడు. సాక్షి సిబ్బంది సమావేశంలో కూడా అదే చెప్తున్నారు.

సాక్షి ఆస్తుల స్తంభన అన్నది కేవలం సాంకేతికమైన లాంఛనమే తప్ప దాని వల్ల పత్రిక నిర్వహణకు ఎటువంటి అడ్డంకీ ఉండదు. దినపత్రికకు ఆస్తులంటే కార్యాలయాల భవనాలు, యంత్ర పరికరాలు మాత్రమే. ఆస్తుల జప్తు అంటే అమ్మకాలు కొనుగోళ్లు నిలిపి వేయడమే తప్ప, ఆఫీసులకు తాళం వేయడం కాదు. ఏ పత్రిక కూడా తన భవనాలు, యంత్రాలను అమ్ముకోవడం జరగదు కాబట్టి, ఈ జప్తు వల్ల పత్రిక ప్రచురణ ఒక్క రోజు కూడా ఆగదు. మరొక ప్రక్క బ్యాంక్ ఖాతాల స్తంభనపై సాక్షి యాజమాన్యానికి న్యాయస్థానంలో అనుకూలత

కొరవ 14వ పేజీలో

ప్రథమవర్ధంతి



మూర్తీభవించిన మానవత్వం,
పరిమళించిన ప్రేమామృత హృదయంతో
మా జీవితాలలో వెలుగులు నింపిన తేజోమూర్తులు,
మా మనోమందిరాలలో దివ్యదీప్తులు
శ్రీ నారాయణస్వామి, శ్రీమతి జయలక్ష్మి గార్ల
ప్రథమ వర్థంతి సందర్భముగా వారిని స్మరించుకొంటూ...
శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

కుమారులు - కోడళ్లు
ఎన్. దామోదర్ - డి.హిమబిందు
ఎన్. వినోద్‌కుమార్ - వి.విష్ణుప్రియ

కుమార్తెలు - అల్లుళ్లు
ఎం.సి వాణి - ఎం.సి. బాలాజి శేఖర్
టి.సుజాత - టి.శ్రీనివాసులు

మనుమలు - మనుమరాళ్లు
నవ్యగ్‌కిషోర్, యశ్వంత్, సాయి చందన్, హేమంత్,
కౌషల్, గిరిష్‌గౌతమ్, దేవిప్రియ, వెంకట ఐశ్వర్య

శ్రీ నారాయణస్వామి - శ్రీమతి జయలక్ష్మి

అధినేత : M/S శ్రీ విజయలక్ష్మి ట్రేడర్స్ & M/S గోల్డన్ ఇంజనీరింగ్
డీలర్స్ : టెక్స్‌మో మోటర్స్ - కిర్లోస్కర్ జనరేటర్స్

[ఆయన జనంలో... వీళ్లు జైలులో!]

వైఎస్ జగన్ అక్రమార్జన కేసులలో పారిశ్రామిక వేత్తలు ఒకరి వెంట ఒకరుగా శ్రీకృష్ణ జన్మ స్థానం చేరుకోవడం చూస్తుంటే బాధ కల్గుతున్నది. పారి శ్రామికవేత్తలంటే జేబు దొంగలుగా జనం భావించే దౌర్భా గ్యం దాపురిస్తున్నది. ఒక పరిశ్రమ స్థాపించడం, పారిశ్రా మికవేత్తగా ఎదగడం మాటలు చెప్పినంత సులువు కాదు. అందుకు ఎంతో కృషి కావాలి, కఠోరమైన శ్రమ కావాలి, తీవ్రమైన మానసిక ఒత్తిడి ఎదుర్కోవాలి, లెక్కలేనన్ని అడ్డం కులు అధిగమించాలి, వైఫల్యాలు తట్టుకోవాలి, క్రింద పడినా మళ్లీ పైకి లేవాలి. ఆ ఆటుపోట్లలో జీవితం హారతి కర్పూరం వలె కరిగి పోతుంది. పరిశ్రమ పురోగతికి ప్రభు త్వము, దాని అధికారులు, రాజకీయ వాదులు అడుగడు గునా అడ్డం తగులుతారు. లేనిపోని చీకాకులు సృష్టిస్తారు. ఏ ప్రభుత్వ అధికారి కూడా పరిశ్రమను దానంతట అదిగా నడవడానికి సహకరించడు. లేబర్ ఆఫీసు గుమస్తా నుంచి పరిశ్రమలశాఖ కార్యదర్శి వరకు అందరి లోనూ పారిశ్రామికవేత్త జేబు కొట్టే దురా లోచన పుష్కలంగా వుంటుంది. భూమి కావాలన్నా, నీళ్లు కావాలన్నా, బొగ్గు కావా లన్నా, కరెంట్ కనెక్షన్ కావాలన్నా, సాధారణమైన అను మతులు, లైసెన్స్‌లు కావాలన్నా అధికారుల చేతులు తడప వలసిందే. ఒక్కొక్కసారి లంచంతో పాటు పైనున్న వారి సిఫార్సు చీటీ కూడా తప్పనిసరి. దానితో అధికారంలో వుండేవారి అండ కోసం వెంపర్లాడక తప్పదు.

ఏ దేశం మనుగడకైనా పారిశ్రామిక వృద్ధి జరిగి తీరాలి. కోట్లాది మందికి ఉపాధి కల్పించేది ఆ రంగమే. నిరుద్యోగం తాండవించే సమాజాలలో అభివృద్ధి సంగతి దేముడెరుగు, శాంతిభద్రతలు కూడా వుండవు. అందువల్లే ఏ దేశమైనా పరిశ్రమల పురోగతికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తాయి. స్పష్టమైన విధానాలు రూపొందించుకొంటాయి. కొత్తగా పరిశ్రమలు పెట్టేవాడికి హారతులిచ్చి స్వాగతం చెప్తాయి. చంద్రబాబు, వైఎస్.రాజశేఖర్‌రెడ్డిల హయాంలో మన రాష్ట్రంలో జరిగింది కూడా అదే. హైటెక్ సిటీ పేరుతో చంద్రబాబు చేసిన హడావుడి ఫలితంగా పేరున్న ప్రతి కంప్యూటర్ కంపెనీ హైదరాబాదులో స్థావరం ఏర్పరచు కొన్నది. దానితో ఈ రోజు దాదాపు 4 లక్షల మంది యువతీ యువకులు ఉపాధి పొందగల్గుతున్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆ ప్రోత్సాహాన్ని మరింత ముమ్మరం చేయ దలచాడు. కానీ దురదృష్టవశాత్తు వైఎస్ జగన్ దురాశ దానికి జత కలిసింది. దాని దుష్ఫలితమే ఇప్పటి పరిణా మాలు. పరిశ్రమల అభివృద్ధి పేరిట ప్రభుత్వ ఆస్తులను, ప్రజాధనాన్ని కొల్లగొట్టడానికి జగన్ అనుసరించిన దుర్మా ర్గమైన పోకడ వల్ల ఈ రోజు ఎందరో పారిశ్రామికుల జీవితాలు చిన్నాభిన్నమై పోతున్నాయి. రాజకీయాలలో అవి నీతి మనకు కొత్త కాదు. ఢిల్లీ నుంచి గల్లీ వరకు అన్ని స్థాయిలలో అన్ని పార్టీలకు చెందిన వారూ ఆ పాప కల్మ షంలో మునిగి తేలుతున్నారు. అయితే జగన్ ఒక అడుగు ముందుకు వేసి, అవినీతిని కాస్తా దోపిడీ స్థాయికి పెంచ దంతోనే వచ్చింది తంటా. అంత స్వల్ప కాలంలో అన్ని వేల కోట్ల ప్రజాధనం లూటీకి పాల్పడిన రాజకీయవాది దేశ చరిత్రలో మరొకరు లేరనడం నిజం.

జమీన్‌రైతు

ఇప్పుడు జగన్‌కు వచ్చిన ఇబ్బంది ఏదీ లేదు. జనా నికి తన తండ్రి చేసిపోయిన ఉపకారాల పునాది మీద అద్భుతమైన రాజకీయ భవిష్యత్తును నిర్మించుకొన్నాడు జగన్. ఎన్నికలలో ఆయనకు ఓటు చేయడానికి జనం సిద్ధంగా వున్నారన్నది వాస్తవం. కానీ ఆయన ధన దురా శకు లొంగిపోయిన పారిశ్రామికవేత్తలందరూ జైలుకు వెళ్లే పరిస్థితి. దేశ చరిత్రలో ఎప్పుడూ జరగని దురదృష్టకర పరిణామం ఇది. సాధారణంగా రాజకీయవాదులు నల్ల ధనం రూపంలో లంచం తీసుకొంటారు. కానీ జగన్ దాన్ని తెల్లధనంగా, తన కంపెనీలలో పెట్టుబడుల రూపంలో తీసుకొన్నాడు. చట్టప్రకారం అందరూ అడ్డంగా దొరికి పోయే పరిస్థితి కల్పించాడు. నన్నెవ్వరేమి చేస్తారనే ధీమాతో ఆయన చేసిన పాపానికి ఇంతమంది పారిశ్రామికవేత్తలు బలికావడం విచారకరం. దీని వల్ల వారికే కాదు, రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి కూడా ఎనలేని నష్టం జరుగు తుంది. అది ఎవరూ పూడ్చలేనిది.

జనవాణి

ఓటరు స్లిప్పుల పంపిణీతో హక్కులకు భంగం!

ఓటరు లిస్టులో నమోదైన ఓటర్లకు ప్రభుత్వ యంత్రాంగం ద్వారానే ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తారని ఆ స్లిప్పుల ఆధారంగానే ఓటింగ్‌కు అనుమతిస్తారని ఎన్నికల సంఘం కొత్త ఆదేశాలిచ్చింది. కోవూరు ఉప ఎన్నికల్లో ఈ విధానాన్ని పాటించారు. నెల్లూరు లోక్‌సభ, ఉదయగిరి అసెంబ్లీ నియోజకవర్గాలకు జరుగు తున్న ఉప ఎన్నికల్లోనూ ఈ విధానాన్నే పాటిస్తామని ప్రకటించారు. పాత రోజుల్లో ఓటర్ల లిస్టులో తమ పేరు సరిచూసుకున్న ఓటర్లు వార్డు నెంబరు, ఇంటి నెంబరు తెలిపి నేరుగా పోలింగ్ స్టేషన్‌లోకి వెళ్లి ఓటువేసే వారు. తనే ఓటరా కాదా అన్న దానికి తన దగ్గరున్న ధృవీకరణలు చూపితే సరిపోయేది. రాజకీయ పార్టీలు చిహ్నాలు లేకుండా ఇచ్చే ఓటరు స్లిప్పులతో ఓటింగ్ త్వరగా జరిగేది. కొత్తగా రంగంలోకి దిగిన బూత్ లెవల్ అధికారులు ఏ మేరకు స్లిప్పులు పంపిణీ చేస్తారో? చేయకుంటే మాత్రం ఓటర్లు ఎంతో అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకోలేరు. ఓటరు లిస్టులోని వివ రాలు తెలిపి నేరుగా స్వేచ్ఛగా తన ఓటు హక్కు వినియోగించుకొనే హక్కు ఓటరుకు ఉంది. దీనికి భిన్నంగా నిర్ణయాలు ఓటరు హక్కును కాలరాయడమే. ప్రధాన ఎన్నికల కమిష నర్ ఈ విషయమై ఉప ఎన్నికల తంతుకు ముందే వివరణ ఇవ్వాలి.

ములుమూడి ప్రభాకరరావు — నెల్లూరు

స్వచ్ఛమైన నీటిని అందించండి!

స్వచ్ఛమైన తాగునీటిని ప్రభుత్వాలు ప్రజలకు అందించలేకున్నాయి. ప్రపం చంలో నీటి లభ్యతకు సంబంధించిన 180 దేశాల జాబితాలో మన దేశం స్థానం 133. అయితే స్వచ్ఛ జలాల లభ్యతలో ఉండే 122 దేశాల జాబితాలో మన దేశం 120వ స్థానంలో ఉందని ప్రపంచ జల అభివృద్ధి నివేదిక చెబుతోంది. కలుషిత జలాలు తాగి వాటి మూలంగా వచ్చే వ్యాధులతో ఏటా లక్షల సంఖ్యలో పిల్లలు మరణిస్తున్నారు. మన రాష్ట్రంలో 19.5 శాతం కుటుంబాలకు మంచి నీరు లభించడం కనాకష్టమవుతున్నదని గణాంకాలు చెబుతున్నాయి. వర్తమాన స్థితిగతులను పరిశీలించి అవసరాలను అంచనావేసి సమగ్ర ప్రణాళికను రూపొందించవలసిన ఆవశ్యకత పాలకులపై ఎంతైనా ఉంది.

పి.అరుణకుమారి — నెల్లూరు

అభినందనలు

నెల్లూరులో పురుడు పోసుకొన్న లీగల్ మాఫియాపై జమీన్‌రైతు 'సణు గుడు'లో సంపాదకుడు డోలేంద్ర ప్రసాద్ వ్రాసిన తీరు ఎంతో బాగుంది. నగ రంలో రౌడీలు, హంతకులు, వైట్ కాలర్ నేరగాళ్లకు ఆ 'న్యాయవాది' అంది స్తున్న సహకారం నగరంలో అందరికీ తెలుసు. పోలీసులు సైతం ఆయన అడు గులకు మడుగులొత్తడం దారుణం. కె.శ్రీనివాసరెడ్డి వంటి ఎస్పీ మళ్లీ నెల్లూ

కొరవ 14వ పేజీలో

70 ఏళ్ల క్రితం ఈవారం

22-5-1942
పేజీలు : 8 వెల: అణా

కలెక్టర్ ప్రకటన

మహమ్మదీయులును, హిందువులును చాలా మంది తమ తమ ఇండ్ల వద్దగానీ, సమీపంలో గానీ పోలీసు బందోబస్తు ఏర్పరచమని నన్ను కోరియున్నారు. ఇటువంటి ప్రార్థనలన్నిటిని నెరవేర్చుట ముమ్మా టికీ అసాధ్యము. పౌరులకు నేను తిరుగా తెలియజేయుట ఏమనగా అచ్చటచ్చట జరుగు ఘాతుక చర్యలు పూర్తిగా నిలిచి పోవుటకు దౌర్జన్యముగా గానీ ప్రతీకారముగాగానీ యెడతెగక కలహమును సాగించు దుండగీండ్రను యిరు మతములలోని పెద్దలు తగు కట్టుదిట్టములలో ఉంచ వలయును. ఉపదేశములకు లొంగని వారిపై జామీను చర్యలు తీసికొనుటకు పెద్దలు పోలీసు వారికి తోడ్పడవలయును.

ఏనాటికైనను యిరు మతముల వారికి ఈ వివాదము రాయబారము వలననూ, రాజీవలననూ పరిష్కరింపబడవలసినదేగానీ, యిట్టి కొట్లాటలు రాజీ కుదరకుండా చేయుట తప్ప రాజీస్వభావమునే మాత్రము మార్చ జాలవనియు యిరు తెగలలోని వివేకవంతులు స్పష్టముగా గ్రహించినారనియు నా నమ్మ కము.

– *జిల్లా మేజిస్ట్రేటు*

తెలుగు పత్రికాధిపతికి శిక్ష

లక్నోలో ప్రకటింపబడు నేషనల్ హెరాల్డు పత్రికలో లక్నో జైలు గూర్చి వ్రాసిన వ్యాసానికై సంపాదకుడు కోటంరాజు రామారావుగారు(ఆంధ్రుడు) మీద లక్నో క్యాంపు జైలు సూపర్నెంటు మాన నష్టపు దావా తేగా జడ్జిగారు సంపాదకునికి ఆరు మాసాల విడి ఖైదు, రూ.750లు జుల్మానా విధించిరి. జుల్మానా ఫిర్యాదికిచ్చునట్లు తీర్పు జెప్పిరి.

50 ఏళ్ల క్రితం ఈవారం

18-5-1962
పేజీలు: 12 వెల: 0-20 న.పై

నెల్లూరు పెద్దాసుపత్రి

నెల్లూరు పెద్దాసుపత్రికి దర్గామిట్టలో నిర్ణయించబడిన స్థలంలో నూతన భవనాలకు జులైలోనో, ఆగష్టులోనో ముఖ్యమంత్రి సంజీవరెడ్డి గారిచే శంకుస్థాపన చేయించగలనని ఏ.సి.సుబ్బారెడ్డిగారు చెప్పారు. ఈ స్థలంలో గులక కొరకు యింకా గోతులు పెడుతున్నారు. ప్రభుత్వం దీనిని అరికట్టడం అవసరం.

కౌన్సిల్ సభ్యత్వం

శాసనసభ నుండి ఎన్నుకోవలసిన కౌన్సిల్ స్థానాలలో కనీసం ఒకటి నెల్లూరుకు రావచ్చునని రాజ కీయ పరిశీలకుల ఊహ. అయితే ఆ సభ్యత్వాన్ని పొందగల అదృష్టవంతుడెవరు?

సమైక్య మద్రాసు రాష్ట్రంలో స్థానిక సంస్థల స్థానం నుండి కౌన్సిల్‌కు ఎన్నుకోబడి ఆంధ్ర రాష్ట్రావతర ణంతో మధ్యలో దానిని కోల్పోయిన నుంకు చెంగన్న చాలాకాలం క్రితం నుండి దీనికి ప్రయత్నం ప్రారంభిం చారు. కానీ, పాపం! ఈ దఫా కాలం కలసి వచ్చినట్లు లేదు. కడకు ఏ.సి సానుభూతికి గూడా పాత్రుడైనట్లు లేదు. ఇక బొమ్మా శేషురెడ్డి, మన్నేపల్లి హనుమంతరావు, దువ్వూరు బలరామరెడ్డి గారలకు గూడా నోరూరు తున్నట్లున్నది గానీ, వీరిని ఆ సభ్యత్వ కన్య వరిస్తుందని మేమనుకోము.

పాలిటెక్నిక్

ఇస్తానన్నపుడు తీసుకోకుండా, చేసిన వాగ్దానం రెండు లక్షలు చెల్లించకుంటే పాలిటెక్నిక్‌ను ఎత్తివేస్తా మని ప్రభుత్వం బెదిరించిందట. ఈ విషయం ఏ.సి.సుబ్బారెడ్డి వెల్లడించిన దానిని బట్టి తెలుస్తున్నది. ఈ విషయంలో రేబాల లక్ష్మీనరసారెడ్డి గారికి గూడా ప్రభుత్వం నుంచి ఉత్తరం వచ్చినట్లుంది.

నెల్లూరు ముచ్చట్లు

సిఎం సంతోషం

తన నెల్లూరు పర్యటన విజయవంతం కావడంతో సిఎం ముఖాన నవ్వులు విరిశాయి. ఆయన మంచి ఎండ సమయంలో ఆత్మకూరుకు వచ్చినా సభకు పెద్ద సంఖ్యలో జనం రావడంతో సిఎం చెమటలో తడిచి ముద్దయినా ఆద్యంతం నవ్వుతూ కనిపించారు. కార్యకర్తలకు హుషారిస్తూ మాట్లాడారు. 15వ తేదీ రాత్రి ఆత్మకూరు నుంచి నెల్లూరు పినాకినీ అతిథి గృహానికి చేరుకొని విశ్రాంతి తీసుకొన్న ముఖ్యమంత్రి 16వ తేదీ ఉదయం డిఆర్ ఉత్తమ హోటల్‌లో పాల్గొన్న మేధావుల, ముఖ్య కార్యకర్తల సమావేశాలు విజయవంతం కావడంతో మంచి ఎండలో పోలీస్ పెరేడ్ గ్రౌండ్ నుంచి వింజమూరుకు ఉల్లాసంగా బయలుదేరారు.

మళ్లీ చంద్రబాబు

మలి విడత ఉప ఎన్నికల ప్రచారం చేయను తెలుగుదేశం పార్టీ సర్వాధినేత చంద్రబాబునాయుడు 16వ తేదీ ఆత్మకూరుకు వచ్చారు. నియోజకవర్గంలోని మండలాల వారీగా కార్యకర్తల సమావేశాల నిర్వహణ అనంతరం రోడ్‌షో నిర్వహించారు. 18వ తేదీ నెల్లూరు రూరల్ నియోజకవర్గం, 19వ తేదీ నెల్లూరు నగరంలో కార్యకర్తల సమావేశాలు నిర్వహించి అనంతరం రోడ్‌షోలలో చంద్రబాబు పాల్గొంటారు.

సుబ్బరామన్న అమాయకుడు!

నెల్లూరు పార్లమెంటు స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న తిక్కవరపు సుబ్బరామిరెడ్డి ఎంతో మంచి మనిషని ఆర్థిక మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. 15వ తేదీ సాయంత్రం ఆత్మకూరులో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ సుబ్బరామన్న సహృదయుడు. వివాదాలకు దూరంగా ఉండే వ్యక్తి. శత్రువుకు కూడా అపకారం తలపెట్టని మనిషి. ఎవరైనా ఎర్రగడ్డ చేతికిచ్చినా దాన్ని క్రింద వేసేస్తాడు. అదే వైకాపా తరపున పోటీచేస్తున్న రాజమోహన్‌రెడ్డి స్వహస్తాలతో బాంబులు వేసిన చరిత్ర ఉన్న వ్యక్తని చెప్పడంతో సభలో చప్పట్లు మారుమ్రోగాయి.

బ్రాహ్మణ
వివాహ సంబంధాలకు
: సంప్రదించండి :
Ph : 0861 - 6527494
email : svsmarriagelinks@live.com

గెలిచేది నేనే - టిఎస్‌ఆర్ జోస్యం!

నెల్లూరు పార్లమెంటు స్థానానికి జరిగే ఉప ఎన్నికల్లో గెలిచేది తానేనని తిక్కవరపు సుబ్బరామిరెడ్డి చెప్పారు. 15వ తేదీ సాయంత్రం ఆత్మకూరులో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ తనకు జోతిష్యం కూడా తెలుసని దీని ఆధారంగానే ఈ మాట చెబుతున్నానన్నారు. తనను గెలిపిస్తే మెట్ట ప్రాంతీయులకు ఎన్నాళ్లుగానో అందని ద్రాక్షలా ఊరిస్తున్న నడికుడి - శ్రీకాళహస్తి రైల్వే లైనుకు రెండునెలల్లో శంకుస్థాపన చేయిస్తానన్నారు. ఢిల్లీలో ఏవిధంగా పనులు చేయించాలో తనకు బాగా తెలుసన్నారు.

అందరిపైనా అనుమానం

నెల్లూరు పార్లమెంటు స్థానం నుంచి కాంగ్రెస్, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీల తరపున పోటీచేస్తున్న అభ్యర్థుల తాలుకు పెద్ద బాధ్యతలన్నీ వారి బంధువులే చూస్తున్నారు. ఇప్పటివరకు ఈ బాధ్యతలను పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలకు అప్పజెప్పలేదు. దీనికిగాను రెండు పార్టీల నాయకుల బంధువులంతా నెల్లూరులో దిగేశారు. బంధువుల పెత్తనాన్ని పార్టీ నేతలు భరించలేక పోతున్నారు. చివరికి ఏమౌతుందో వేచి చూడాల్సిందే.

జంప్ జిలాని

రాజకీయ పార్టీల్లో తరచూ పార్టీలు మారేవారిని జంప్ జిలానీలంటారు. కేవలం ఐదేళ్ల వ్యవధిలో నాలుగు పార్టీలు మారి 'జంప్ జిలాని'గా ప్రసిద్ధుడయ్యాడు బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి. అనుమసముద్రంపేట జడ్పీటీసి సభ్యునిగా కాంగ్రెస్ పార్టీ తరపున గెలిచిన ఆయన తర్వాత తెలుగుదేశం పార్టీ సహకారంతో ఎమ్మెల్సీగా గెలిచారు. టిడిపిలో చేరుతారన్న ప్రచారం జరిగే రోజుల్లో ప్రజారాజ్యం పార్టీలో చేరి ఆ పార్టీ జిల్లా కన్వీనర్‌గా వ్యవహరిస్తూ కాంగ్రెస్‌లోకి మారారు. 14వ తేదీ కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని కలసి వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరను గ్రీన్‌సిగ్నల్ పొందారు.

కొత్త కౌంటింగ్ సెంటర్

నెల్లూరు పార్లమెంటు, ఉదయగిరి అసెంబ్లీ నియోజకవర్గాలకు జరిగే ఉప ఎన్నికల తాలుకు జూన్ 15వ తేదీ జరిగే కౌంటింగ్‌కు కలెక్టర్ కొత్త కేంద్రాన్ని ఎంపిక చేశారు. కనుపర్తిపాడులోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కాలేజిలోనే కావలి, ఆత్మకూరు, కోవూరు, నెల్లూరు, నెల్లూరు రూరల్, ఉదయగిరి నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు జరుగుతుంది. గతంలో కౌంటింగ్ కేంద్రాలుగా కోవూరు పాలిటెక్నిక్, నెల్లూరు డికెడబ్ల్యు, ఎసి స్టేడియం ఉండడం వల్ల తుది ఫలితం వెల్లడికి కాస్త సమయం పట్టేది. ఈ ఇబ్బందులను అధిగమించను ఒకే చోట కౌంటింగ్‌కు కలెక్టర్ శ్రీధర్‌రెడ్డి, ఎన్నికల కమిషనర్ భన్వర్‌లాల్‌కు చెప్పి ఒప్పించారు.

18 నుంచి నామినేషన్ల స్వీకరణ

నెల్లూరు పార్లమెంటు, ఉదయగిరి అసెంబ్లీ నియోజకవర్గాలకు జరిగే ఉప ఎన్నికలను పురస్కరించుకొని నామినేషన్లను 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు స్వీకరిస్తారు. 26వ తేదీ స్క్రూటినీ, 28వ తేదీ నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు. నామినేషన్ల స్వీకరణ సమయంలో అభ్యర్థితోపాటు నలుగురిని మాత్రమే రిటర్నింగ్ ఆఫీసర్ దగ్గరకు అనుమతిస్తారని కలెక్టర్ శ్రీధర్‌రెడ్డి స్పష్టం చేశారు.

కలెక్టరే రిటర్నింగ్ అధికారి!

నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గానికి జరిగే ఉప ఎన్నికకు సంబంధించి రిటర్నింగ్ అధికారిగా జిల్లా కలెక్టర్ శ్రీధర్‌రెడ్డి వ్యవహరిస్తారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా అదనపు జాయింట్ కలెక్టర్ లక్ష్మీకాంతం నియమితులయ్యారు.

చందాదారులకు మనవి

- చందా పంపించేటప్పుడు తమ చందా నెంబరు, పూర్తి పేరు, చిరునామా తెలియపరచండి.
- మీ చందా నెంబరు, చందా ఏ తేదికి అయిపోతుందో, అడ్రసు రేపరు మీదనే ముద్రించి వుంటుంది.
- 'జమీన్‌రైతు' చందాదార్లు తమ చందాను ఎం.ఓ/డి.డి లేదా Online‌లో ఆంధ్రాబ్యాంక్, విఆర్‌కాలేజ బ్రాంచి, నెల్లూరు అకౌంట్ నెంబర్: 106811011000423‌లో ZAMINRYOT పేరుతో జమచేయవచ్చు. సకాలంలో చందా చెల్లించ వలసినదిగా కోరుతున్నాము.
- చెక్కులు స్వీకరించబడవు.

జీవిత చందా రూ.1000/-

సంవత్సర చందా

స్వదేశంలో రూ.200/-

విదేశాలకు రూ.1000/-

జమీన్‌రైతు
పాగతోట, నెల్లూరు - 524 001
ఫోన్: 0861 - 2327354
సెల్: 98489 66190

మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ


ఉప ఎన్నికల్లో పత్రికలు, టివీల్లో వచ్చే వివిధ రకాల పెయిడ్ ఆర్టికల్స్ పరిశీలనకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ జిల్లా కొక కమిటీని నియమించింది. నెల్లూరులో ఈ కమిటీకి జాయింట్ కలెక్టర్ సౌరభ్‌గౌర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. డిపిఆర్వో కమలాకర్‌రెడ్డి, వార్త బ్యూరో బి.శ్రీనివాసరావు, మహాటీవి రిపోర్టర్ గౌస్ ఇందులో సభ్యులు.

వర్షం

ఎండలు మండుతున్న వేళలో 13వ తేదీ ఉదయం ఈదురుగాలులతో నెల్లూరు నగరంలో పడిన వర్షం నగర వాసులకు ఆ రోజు హాయినిచ్చింది. ఆ మరుసటి రోజు నుంచి మళ్లీ ఎండ దంచి కొడ్తోంది.


వీరాంజనేయరెడ్డి ప్రయోగం

నెల్లూరు సిసిఎస్ సిఐగా నియమితుడైన వీరాంజనేయరెడ్డి క్రైం పోలీసులపై వస్తున్న విమర్శల నుంచి బయటపడేయను కొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. నగరంలోని ఆరు స్టేషన్లకు సిసిఎస్ నుంచి స్టేషన్‌కు నలుగురు చొప్పున 24 మందిని పంపారు. వీరు నగరంలో తమకు డ్యూటీవేసిన ప్రాంతంలో బంగారు సరుళ్లు, మోటారు సైకిళ్ల దొంగతనాలు జరుగకుండా చూస్తారు. ఒకవేళ దొంగతనం జరిగితే క్రైం పోలీసులు దీనికి బాధ్యత వహించాలి. ఒక రకంగా చెప్పాలంటే ఈ బాధ్యతలు క్రైం పోలీసులకు కత్తిమీద సామే.



ఉదయగిరిలో జరిగిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశంలో నెల్లూరు పార్లమెంట్, ఉదయగిరి అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్న పార్టీ అభ్యర్థులు వంటేరు వేణుగోపాలరెడ్డి, బొల్లినేని రామారావులను పరిచయం చేస్తున్న చంద్రబాబు నాయుడు.

డాక్టర్ కొండారెడ్డికి పురస్కార్ అవార్డు



నెల్లూరులో పేరెన్నికగన్న పంటి వైద్యుడు డాక్టర్ జి.కొండారెడ్డి సేవలను ఢిల్లీలోని తెలుగు కళా సంఘం గుర్తించింది. మే 24వ తేదీ ఢిల్లీలోని ఆంధ్ర భవన్‌లో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆడిటోరియంలో జరిగే సంఘం ఏడవ వార్షికోత్సవంలో ఆయనకు పురస్కార్ అవార్డు అందిస్తారు. ఢిల్లీలోని తెలుగు కళా సంఘానికి ఎంతో ప్రత్యేక గుర్తింపు ఉంది. అటువంటి సంఘం డాక్టర్ కొండారెడ్డి సేవలను గుర్తించి సత్కరించడమే విశేషం. ఈ యేడాది డాక్టర్ కొండారెడ్డి సేవలను గుర్తించి నెల్లూరులోని హరివిల్లు క్రియేషన్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుని చిన్న సంగతి పాఠకులకు విదితమే.

కొరవ 14వ పేజీలో

వజ్రం - బంగారం - వెండి
ఫ్యాక్టరీ అవుట్‌లెట్
BIS 916 హాల్‌మార్క్
బంగారు ఆభరణములపై*
తరుగు 6% నుండి - కూలి లేదు.
వెండి వస్తువులపై*
తరుగులేదు - కూలిలేదు.
డైమండ్స్‌పై 10% తగ్గింపు*
*T&C Apply
గోల్డ్ ప్యాలెస్
ఆచారివీధి, హోటల్ శివం ఎదురుగా,
జిల్లా పరిషత్ ఆఫీస్ సెంటర్, నెల్లూరు.
ఫోన్: 2331133, 2327611

సిల్వర్ ఫ్యాక్టరీ అవుట్‌లెట్
925 STERLING SILVER*
EXPORT QUALITY
వెండి వస్తువులపై*
తరుగు లేదు, కూలి లేదు.
*T&C Apply
సిల్వర్ ప్లాజా
EXCLUSIVE SILVER SHOW ROOM
(A Unit of Gold Palace)
ఆచారివీధి, హోటల్ శివం ఎదురుగా,
జిల్లా పరిషత్ ఆఫీస్ సెంటర్, నెల్లూరు.
ఫోన్: 2331132, 2331121




తక్కెడలతోనే ఇంకా తూకం.

నెల్లూరు చేపల మార్కెట్‌లో రౌడీరాజ్యం!

దేశంలోనే ఆధునిక మార్కెట్‌లో ఇదేం దౌర్భాగ్యం!

నెల్లూరు డైకస్‌రోడ్డులోని జలపుష్పభవన్(చేపల మార్కెట్) దేశంలోనే అత్యంత ఆధునికమైన మార్కెట్ అని గోబెల్స్ ప్రచారాన్ని చేసింది కార్పొరేషన్. ఇక్కడున్న అత్యాధునిక వసతులు ఏమిటో ప్రతినిత్యం మార్కెట్‌కు వెళ్లే వారికి బాగా తెలుసు. చేపలు కడిగే నీళ్లు సరిగ్గాపోయే వసతిలేక గబ్బుకొడుతున్న మార్కెట్‌లో చేపలు అమ్మేవాళ్లు, తోమేవాళ్లు ప్రదర్శిస్తున్న రౌడీయిజానికి మార్కెట్‌కు వెళ్లిన వినియోగదారులు బిక్కచచ్చిపోతున్నారు. కొత్త చేపల మార్కెట్ అని ప్రతి చేప కిలో రేటు కాస్త పెంచి అమ్ముతున్నారు. కానీ మార్కెట్‌లో వందకు పైగా ఉన్న చేపల విక్రయ అంగళ్లలో కేవలం పది చోట్ల మాత్రమే ఎలక్ట్రానిక్ కాటాలు వినియోగిస్తున్నారు. వీటిలోనూ తూకం సరిగ్గా లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. రేటు తగ్గించమని అడిగినా, తూకం సరిగ్గా తూయమన్నా మార్కెట్‌లో చేపల విక్రేతలు కూరగాయల మార్కెట్ తరహాలో తగువులకు దిగుతున్నారు. వీరికితోడుగా అన్నట్లు చేపలు తోమే వాళ్లు గతంలో కిలో పెద్ద చేపలు తోమను తీసుకొంటున్న పది రూపాయలను ఒకేసారి ఇరవై రూపాయలు చేశారు. కిలో రొయ్యలు వలువను ముప్పై రూపాయలు వసూలు చేస్తున్నారు. పక్కెలు, మట్టగిడెసల వంటి చిన్న చేపలు కిలో 40 రూపాయలకు దొరుకుతుండగా వీటిని తోమను కిలోకు 40 రూపాయలు దబాయించి అడుగుతున్నారు. తమిళనాడుకు చెందిన అరవ మహిళల ఆధిపత్యం మూలంగా మార్కెట్‌లో నిత్యం గలాటాలు జరుగుతున్నాయి. దీనివల్ల మార్కెట్‌కు చేపల కొనుగోలుకు వెళ్లిన ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. డబ్బులు వెచ్చించి కూడా సరైన చేపలు కొనే పరిస్థితులు మార్కెట్‌లో లేవు. ఇక్కడ సాదాసీదా పరిస్థితులు నెలకొనేలా చేయను కార్పొరేషన్ కమిషనర్ చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



రైల్వే బోర్డుకు సుబ్బరామిరెడ్డి లేఖ!

- కావలిలో రైళ్లను ఆపాలన్న ఆవశ్యకతపై స్పందన



మంచి పనులకు శ్రీకారం చుట్టిన టిఎస్ఆర్.

కావలి మీదుగా నడుస్తున్న మూడు ప్రధాన రైళ్లు కావలిలో రెండు నిమిషాలపాటు ఆపేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని రైల్వే బోర్డు మెంబరు కె.కె.శ్రీవాత్సవ్‌కు రాజ్యసభ సభ్యులు డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డి లేఖ వ్రాశారు. బెంగుళూరు – కాకినాడ, బెంగుళూరు – తిరుపతి శేషాద్రి ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్ – తిరుపతి పద్మావతి ఎక్స్‌ప్రెస్, చెన్నై – న్యూఢిల్లీ – చెన్నై – జిటి ఎక్స్‌ప్రెస్ రైళ్లను కావలిలో రెండు నిమిషాలు ఆపినట్లైతే కావలి నుండి చెన్నై, తిరుపతి, సికింద్రాబాద్, బెంగుళూరు, కాకినాడ, ఢిల్లీకి రాకపోకలు జరిపే ప్రయాణీకులకు ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. వాణిజ్యపరంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న కావలిలో ఈ రైళ్లను ఆపాల్సిన ఆవశ్యకతను సుబ్బరామిరెడ్డి తన లేఖలో వివరించారు.

నిద్రావస్థలో నిఘా!

నెల్లూరులో పెచ్చుపెరిగిన దొంగతనాలు

ప్రశాంతతకు పేరుగాంచిన నెల్లూరు నగరం నేడు అసాంఘిక శక్తులు, దోపిడీదారులు, దొంగలకు పేరుగాంచింది. ఎక్కడ చూసినా దొంగతనాలు, దోపిడీలు, మహిళలపై అఘాయిత్యాలకు నిలయంగా మారింది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా దొంగలు పెట్రేగి పోతున్నారు. వేసిన తాళాలు వేసినట్లే ఉంటున్నాయి. దొంగలు దోచుక పోతున్నారు. చైన్ స్నాచర్‌లు ఎక్కువయ్యారు. ఒంటరిగా మహిళలు రోడ్డు మీదకు వస్తే మెడలోని ఆభరణాలు తెంచుకొని వెళ్లిపోతున్నారు. బ్యాంకుల దగ్గర పెద్ద మొత్తంలో నగదు డ్రా చేసుకొని వెళ్లే వారిని బురిడీ కొట్టించి తస్కరించే కేసులు అధికంగానే ఉంటున్నాయి. ఇక వాహనాల గురించే చెప్పనవసరం లేదు. రోడ్డుపై నిలిపిన వాహనాలను క్షణాల్లో దొంగిలించేస్తుండడంతో వాహనాల యజమానులు లబోదిబోమంటున్నారు. పోలీస్ స్టేషన్‌కు పరిగెడుతున్నారు. ఇటీవల కాలంలో ఈ దొంగతనాలు ఎక్కువయ్యాయి. ఇన్నివిధాల దొంగలు స్థైర విహారం చేస్తున్నా వారిని అరికట్టడంలో మాత్రం పోలీసులు ఘోరంగా విఫలమయ్యారు. దీనికి ముఖ్యకారణం నిఘా కొరవడడం. అసాంఘిక శక్తుల సంచారం, పాత నేరస్తుల కదలికలపై పోలీసులు తగిన శ్రద్ధ పెట్టకపోవడంతో నగరంలో మూడు దొంగతనాలు, ఆరు చైన్‌స్నాచింగ్‌లుగా మారింది పరిస్థితి. రాత్రి వేళల్లో గస్తీకి సుస్తీ చేసిందనే చెప్పాలి. ఎక్కడో ఒకచోట వాహనాన్ని నిలుపుకొని బాతాఖానీ కొట్టి గస్తీ అయిందనిపించడం తప్ప నిఖార్సుగా డ్యూటీ చేయకపోవడంతో నగర వాసులకు దొంగల బెడద కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఎవరింట్లో దొంగతనం జరుగుతుందో, ఎవరి వాహనం తస్కరించ బడుతుందోనన్న భయం నెలకొనింది.

టిఎస్ఆర్‌కు పలు సంఘాల సంఘీభావం!



సుబ్బరామిరెడ్డితో ఆర్యవైశ్య నాయకులు.

నెల్లూరు లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డిని 10వ తేది పలు సంఘాల ప్రతినిధులు కలసి సంఘీభావం తెలిపారు. నెల్లూరు అర్బన్ ఆర్యవైశ్యుల సంఘం అధ్యక్షులు కోట గురు బ్రహ్మం, ప్రధాన కార్యదర్శి తులసి చంద్రశేఖర్, కోశాధికారి జె.మోహన్‌రావు, రాష్ట్ర కార్యదర్శి కె.వి.చలమయ్య, శేగు లక్ష్మణరావు, సింహపురి వాణిజ్య మండలి అధ్యక్షులు కె.తిరుమలరావు, జిల్లా టింబర్ మర్చంట్స్ అసోసియేషన్ కార్యదర్శి దర్శి నరసింహారావు, కోశాధికారి కె.వి.సుబ్బారావు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎన్.కోటేశ్వరరావు, క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ నాయకుడు అమరా మోహన్‌రావు కలసి సంఘీభావం తెలిపారు.

కళాజాతాల ప్రచారం

ఓటు హక్కుపై అవగాహనకు ప్రభుత్వ ప్రయత్నం

జిల్లాలో వచ్చే నెలలో జరుగనున్న నెల్లూరు పార్లమెంటు, ఉదయగిరి అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కళాజాతాలతో ప్రచారం నిర్వహించనున్నారు. ఈ నెల 20వ తేది నుంచి మే 8వ తేది వరకు కళాజాతాలు ప్రచారం నిర్వహిస్తాయి. జిల్లాలోని 480 గ్రామాల్లో కళాజాతాలు పర్యటించే విధంగా ప్రణాళిక రూపొందించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. ఉపఎన్నికల్లో ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ఉద్దేశం.

అయ్యోర్ల అవతారాలు!

- కార్పొరేట్ విద్యాసంస్థల పిఆర్వోలిప్పడు!

ఉపాధ్యాయులు చదువు చెప్పడం మానేసి వివిధ వ్యాపారాలు, ఇతరత్రా కార్యకలాపాల్లో బిజీగా ఉంటున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు చేస్తున్నవి చాలదన్నట్లు కొత్తగా కార్పొరేట్ విద్యా సంస్థలకు పిఆర్ఓలుగా అవతారం ఎత్తారు. పదవ తరగతి ఫలితాలు విడుదల కాకముందే ఆయా విద్యార్థుల చిరునామాలు సంపాదించి అరచేతిలో స్వర్గాన్ని చూపించే రీతిలో ఆయా కళాశాలల గురించి ఊదరగొడుతున్నారు. పంచ రంగులలో అందంగా ముద్రించిన కరపత్రాలను వారికి చూపుతూ కళాశాల గొప్పతనాన్ని, అందులోని సౌకర్యాల గురించి విశదీకరించి చెప్తూ మీ పిల్లలను తమ కళాశాలల్లో చేర్పిస్తే మంచి శిక్షణ లభిస్తుందని మాయ మాటలు చెప్తూ తిరిగే అయ్యోర్ల సంఖ్య అధికం అయ్యింది. మా ద్వారా చేర్పిస్తే ఫీజుల్లో తగ్గింపు వస్తుందని చెప్తున్నారట. పదవ తరగతి ప్రీ పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు తెచ్చుకొన్న ఆయా విద్యార్థుల అడ్రసులు స్కూళ్ల నుంచి సేకరించి వారి ఇళ్ల ముందు పొద్దునే వాలిపోతున్నారు ఈ పిఆర్ఓలు. కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలల మధ్య నెలకొన్న పోటీ కారణంగా ఎవరికి వారు ప్రభుత్వ ఉపాధ్యాయులను తమ సంస్థలకు పిఆర్ఓలుగా పెట్టుకొని వివిధ ప్రాంతాలకు పంపుతున్నారట. ఒక్క విద్యార్థిని చేర్పించినట్లయితే వెయ్యి నుంచి రెండు వేల రూపాయలు ఇస్తున్నారట. వేలాది రూపాయలు ప్రభుత్వం నుంచి తీసుకొనే ఉపాధ్యాయులు కళాశాలలు ఇచ్చే కమిషన్ కోసం కక్కుర్తిపడి పిల్లలకు లేనిపోని ఆశలు కల్పించడాన్ని చూసిన జనం వీరేమి అయ్యోర్లని విమర్శిస్తున్నారు.

ఆత్మకూరు రాజకీయం మారుతోంది




ఆనం కుటుంబానికి ఆత్మకూరు నియోజకవర్గంలో తొలి నుంచి ఒక ప్రత్యేకత ఉండేది. సుదీర్ఘ కాలం తరువాత ఆనం కుటుంబం నుంచి రామనారాయణరెడ్డి ఆత్మకూరు నుంచి పోటీచేసి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆనం కుటుంబంపై అభిమానంతోపాటు అప్పటి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చరిష్మాతో పది వేలకు పైచిలుకు ఓట్లతో ఆయన్ను గెలిపించారు ఇక్కడ ప్రజలు. తర్వాత జరిగిన అనేక రాజకీయ పరిణామాల్లో వైఎస్ ద్వారా లబ్ధి పొంది ఉన్నతస్థాయికి చేరిన ఆనం వైఎస్ కుటుంబాన్ని దోషిగా చేసి మాట్లాడుతుండడంతో నియోజకవర్గ ప్రజలు జీర్ణించుకోలేక పోతున్నారు. వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి ఫోటోతో గెలిచిన ఆనం ఇప్పుడు సోనియాగాంధీ పాట పాడుతున్నారు. అధికార పార్టీ మంత్రిగా ఉండడం వల్ల బహిరంగంగా వ్యతిరేకించేవారు తక్కువగా కనిపిస్తున్నారు. లోపల మాత్రం వ్యతిరేకించేవారు అధికంగా ఉన్నారు. వచ్చే నెలలో జరుగనున్న ఉప ఎన్నికల్లో ఆనంపై ఉన్న వ్యతిరేకత తప్పనిసరిగా కనిపించే అవకాశం ఉంది. గతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆనంకు వచ్చిన మెజార్టీ కంటే త్వరలో జరిగే ఉప ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి మరింత మెజార్టీ వస్తుందని చెప్పొచ్చు. మంత్రి ఆనం మాత్రం ఆత్మకూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ తెస్తానని ప్రగల్భాలు పలుకుతున్నారు. నియోజకవర్గంలో సమర్థవంతమైన దిగువస్థాయి నాయకుడు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి లేకపోయినప్పటికీ అభిమానులు మాత్రం కోకొల్లలుగా ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడును ఇన్‌ఛార్జీగా నియమిస్తారన్న ప్రచారం జరుగుతోంది. ఈయన నియామకం జరిగితే ఇక్కడ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి తిరుగుండదని విశ్లేషకులు భావిస్తున్నారు.

● గూడూరులో

వంటగ్యాస్ కోసం నానాపాట్లు!

పట్టణానికి దూరంగా ఏజెన్సీ

గూడూరు పట్టణానికి దూరంగా గ్యాస్ ఏజెన్సీని ఏర్పాటు చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడక తప్పడం లేదు. గ్యాస్ బుక్ చేసుకున్న వారికి నిర్ణీత సమయంలో డెలివరీ చేయాల్సి ఉన్నా ఆ దిశగా ప్రయత్నం చేయడం లేదు నిర్వాహకులు. గూడూరు పట్టణానికి చెందిన శ్రీ సాయి గ్యాస్ ఏజెన్సీలో గ్యాస్ బుక్ చేసుకున్న వినియోగదారులు లబోదిబోమంటున్నారు. ఏజెన్సీలో విధులు నిర్వహించే సిబ్బంది బ్లాక్‌మార్కెట్లో సిలిండర్లు 700 రూపాయల నుంచి 1000 రూపాయల వరకు బహిరంగంగానే హోటళ్లు, వ్యాపారస్తులకు విక్రయిస్తున్నారు. ఇటీవల వరకు పట్టణంలోని తూర్పు వీధిలో నిర్వహించిన గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాన్ని ధూర్జటినగర్ ప్రాంతానికి తరలించారు. ఇక్కడ తరచూ గ్యాస్ పంపిణీ విషయమై వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులకు నిత్యం గొడవలు జరుగుతుండేవి. పట్టణానికి దూరంగా ఏజెన్సీని ఏర్పాటుచేసి అక్కడ నుంచి బ్లాక్ మార్కెట్‌కు గ్యాస్ సిలిండర్లను తరలిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్యాస్ పంపిణీ సక్రమంగా జరగడం లేదన్న విషయం సంబంధిత శాఖ అధికారులకు తెలిసినా కూడా నిర్వాహకులపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం విశేషం.



నెల్లూరులో జరిగిన మేధావుల సదస్సులో ఆర్థికశాఖామాత్యులు శ్రీ ఆనం రామనారాయణరెడ్డి గారు, నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి శ్రీ టి.సుబ్బరామిరెడ్డిగారు, ఎమ్పీ మరియు నెల్లూరు రూరల్ శాసనసభ్యులు శ్రీ ఆనం వివేకానందరెడ్డి గారి సమక్షంలో నెల్లూరుకు వరాల జల్లు కురిపించిన ముఖ్యమంత్రి శ్రీ ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి గారిని అభినందిస్తున్న ఫిన్‌లాండ్, సింగపూర్, జపాన్ దేశాల్లో జరిగిన ప్రపంచ క్రీడలలో పాల్గొన్న అంతర్జాతీయ వెటరన్ క్రీడాకారుడు **డాక్టర్ మండవ శ్రీధర్‌రావు,** అనితా హాల్ ప్రక్కన, నెల్లూరు. సెల్: **98490 77447.**

మేకపాటి విజయం కోసం ...

అబ్దుల్ అజీజ్ ఇంటింటా విస్తృత ప్రచారం

నెల్లూరులో మైనారిటీ నాయకుడు అబ్దుల్ అజీజ్ ప్రచారానికి విశేష స్పందన.



జిల్లాలో జూన్ 12వ తేది జరిగే ఉప ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి మేకపాటి రాజమోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ వేలాది మంది యువకులతో 12వ తేది సాయంత్రం 29, 30 వార్డుల్లో డైకస్ రోడ్డు ప్రాంతంలో అబ్దుల్ అజీజ్ ప్రచార పాదయాత్ర జరిగింది. దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను ఆయన గడపగడపకు వివరిస్తూ జిల్లాలో పేద, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలు అభివృద్ధి చెందాలంటే ఈ ఉప ఎన్నికల్లో మేకపాటి సోదరులను గెలిపించుకోవాలన్నారు. ఈ ప్రచార పాద యాత్రలో దారిపొడవునా అబ్దుల్ అజీజ్‌కు మహిళలు, మైనార్టీ పేద బడుగు వర్గాల ప్రజలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సిటీ కన్వీనర్ ఆనం వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ 29, 30 వార్డుల్లో మౌలిక సదుపాయాలు అధ్వాన్నంగా ఉన్నాయని, మంచినీటి కాలుష్యం, దోమల బెడద, డ్రైనేజి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, తమ పార్టీ అధికారంలోకి వస్తే అన్నీ పరిష్కరిస్తామన్నారు.


వైఎస్ఆర్ రుణం తీర్చుకోండి!

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు అభ్యర్థి మేకపాటి రాజమోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ సోమవారం సాయంత్రం అయ్యప్పగుడి, ఆటోనగర్ తదితర ప్రాంతాల్లో వైఎస్ఆర్ పార్టీ నాయకులు అబ్దుల్ అజీజ్ ప్రచార పాదయాత్ర సాగింది. ఈ ప్రచార పాదయాత్రలో హాజీ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ మన రాష్ట్రానికి పట్టిన దుర్గతి పోవాలంటే జగన్ సిఎం అవ్వాలన్నారు. వైఎస్ఆర్ ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు అందుకున్న ప్రజానీకం తమ అమూల్యమైన ఓటును వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మేకపాటి రాజమోహన్‌రెడ్డికి వేసి వైఎస్ఆర్ ఋణం తీర్చుకోవాలని పిలుపునిచ్చారు. సిటీ కన్వీనర్ ఆనం వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ఆటోనగర్‌లో మౌలిక సదుపాయాలు అధ్వాన్నంగా ఉన్నాయని, రోడ్లు దెబ్బతిని ఉన్నాయని, వీధి దీపాలు వెలగడం లేదు. అయినా ప్రజాప్రతినిధులకు కళ్లు కనబడవా? అని ప్రశ్నిస్తూ తమ పార్టీ అధికారంలోకి వస్తే తాము అన్ని సమస్యలు పరిష్కరిస్తామన్నారు. రైతు నాయకుడు మలిరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ 12వేల కోట్ల రుణాలను మాఫీ చేయడం ద్వారా వైఎస్ఆర్ రైతులకు అభిమానపాత్రుడయ్యాడని అన్నారు. నెలకు 75 రూపాయలుగా ఉన్న ఫించన్లను 200, 500 రూపాయలుగా పెంచి 1,20,000 మందికి ఫించన్లు మంజూరు చేశారని తెలిపారు. ఈ ప్రచార పాదయాత్రలో నెల్లూరు సిటీ మైనార్టీ ఇన్‌ఛార్జ్ అబ్దుల్ అజీజ్ తోపాటు అబ్దుల్ జలీల్, మునీర్, సిద్ధిఖి, హనుమారెడ్డి కిషోర్‌రెడ్డి, యజ్దాన్, దత్తు, సూరి, హాజీ, కమల్, రఫీ, మస్తానయ్య, శ్రీరాములు, జిలానీ, బాబు, వసంతకుమార్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో భారీగా మహిళలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరిక

మదర్స్‌డేని పురస్కరించుకొని హరనాథపురంలోని హాజీ అబ్దుల్ అజీజ్ చారిటబుల్ ట్రస్ట్‌లో 13వ తేది ఉదయం జరిగిన కార్యక్రమంలో 50 మంది మహిళలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ్యత్వాన్ని స్వీకరించారు. రానున్న ఉప ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి రాజమోహన్‌రెడ్డిని భారీ మెజార్టీతో హాజీ అబ్దుల్ అజీజ్ నాయకత్వంతో గెలిపించడానికి కృషిచేస్తామని మహిళా నాయకురాలు మొమలా మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా హాజీ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ మనకోసం, మన అభివృద్ధి కోసం ఆలోచించే పార్టీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అన్నారు. 'అమ్మబడి' పథకానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాంది పలికిందని, వడ్డీ లేకుండా ఋణాలు, వృద్ధాప్య పెన్షన్లు, గూడులేని వారందరికీ ఇళ్లు అన్నివర్గాల వారికి పలు పథకాలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రూపొందించిందన్నారు. మహానేత వైఎస్ఆర్ ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ ద్వారా పేదలు ఆరోగ్యాలను బాగు చేసుకున్నారని తెలిపారు. విద్యలేనిదే అభివృద్ధి కష్టమని ముస్లింల విద్యాభ్యున్నతి కోసం దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి 4% రిజర్వేషన్లు కేటాయిస్తే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మరో అడుగు ముందుకేసి ముస్లింలకు కనీసం 4% రాజకీయ రిజర్వేషన్లు ప్రకటించిందన్నారు. జూన్ 12వ తేదీ జరిగే ఉప ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి మేకపాటి రాజమోహన్‌రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిదన్నారు. అన్నివర్గాల అభ్యున్నతికి అనేక పథకాలు రూపొందించిన ఈ పార్టీ అధికారంలోకి వచ్చే వరకు మనమంతా శక్తివంచన లేకుండా కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ, అసెంబ్లీ నియోజకవర్గ మైనార్టీ ఇన్‌ఛార్జ్‌లు అబ్దుల్ జలీల్, మునీర్ సిద్ధిఖీ, యజ్దాన్, మౌలానా అజీజ్, హాజీ, రఫీ, కమల్, హాజీ మునీర్ తదితరులు పాల్గొన్నారు





ఒక్క అవకాశం ఇవ్వండి!

కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలో పేదలకు ఒరిగిందేమీలేదని ఉదయగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బొల్లినేని రామారావు విమర్శించారు. పదవుల కోసం పాకులాడడంలో కాంగ్రెస్ పార్టీ తలమునకలై వుండగా, అవినీతి సొమ్ముతో ముఖ్యమంత్రి పీఠం అధిష్టించడానికి వైఎస్ జగన్ వెంపర్లాడుతున్నాడని దుయ్యబట్టారు. రాష్ట్రప్రజలకు సంక్షేమ పథకాలు అందించి, వారి జీవితాల్లో వెలుగులు తెచ్చిన ఘనత ఒక్క తెలుగుదేశం పార్టీదేనన్నారు. ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వం గ్రామాల్లో వేసిన సిమెంటురోడ్లు, వాటర్ ట్యాంకులు, పాఠశాలల భవనాలే తప్ప, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వింజమూరు మండలంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. అవినీతిలో

బొల్లినేని రామారావు అభ్యర్థన

మునిగిపోయిన కాంగ్రెస్, వైఎస్ జగన్ పార్టీలకు రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. తనను ఆదరించి ఎన్నికల్లో గెలిపిస్తే ఉదయగిరి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు.



జొన్నవాడ కామాక్షమ్మ బ్రహ్మోత్సవాల సందర్భంగా ధ్వజారోహణ చేస్తున్న అర్చకులు.



ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం పాటు పడుతున్న హాజీ అబ్దుల్ అజీజ్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు అబ్దుల్ అజీజ్ జన్మదినం సందర్భంగా గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు.

బిట్రగుంటను అభివృద్ధి చేస్తా!

వంటేరు హామీ

ఎంతో ఘనచరిత్ర వున్న బిట్రగుంట రైల్వేను అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి వంటేరు వేణుగోపాలరెడ్డి హామీ ఇచ్చారు. బోగోలు మండలంలో జరిగిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ నియోజకవర్గం నుంచి ఎమ్మీగా గెలిచిన మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఈ ప్రాంత అభివృద్ధికి చేసిందేమీ లేదన్నారు. కావలి రైల్వే సమస్యలపై వర్తక సంఘం వాళ్లు రెండేళ్ల క్రితం మేకపాటిని కలసి సమస్యలు విన్నవిస్తే వెంటనే పరిష్కరిస్తానని చెప్పిన ఆయన రాజీనామా చేసేవరకు వాటి గురించే పట్టించుకోలేదన్నారు. ఈ ఎన్నికల్లో తనను గెలిపించినట్లయితే బిట్రగుంట, కావలి ప్రాంతంలో సూపర్ ఫాస్టురైళ్లు నిలుపుదలతోపాటు వివిధ సమస్యలను పరిష్కరిస్తానన్నారు. బిసిలకు రాజకీయ అవకాశం, పదవులు ఇచ్చిన ఘనత తెలుగుదేశం పార్టీదేనన్నారు కావలి శాసన సభ్యుడు బీద మస్తాన్‌రావు. కాంగ్రెస్‌పార్టీ, వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీలో బిసిలను అణగదొక్కుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌లో నెల్లూరు నగరం నుంచి బిసి అయిన అనిల్ కుమార్‌యాదవ్‌కు టిక్కెట్ ఇస్తే ఆపార్టీ నేతలే దెబ్బతీశారని గుర్తు చేశారు. మామధ్య ఎలాంటి విబేధాలు లేవని, వంటేరు విజయానికి తమవంతు కృషి చేస్తామన్నారు. ప్రతి కార్యకర్త కాంగ్రెస్, వైఎస్ఆర్ కాంగ్రెస్‌ల అవినీతిని ప్రజలకు తెలియజెప్పాలన్నారు.

ఇళ్ల పట్టాలిప్పించిన కురుగొండ్ల!

వెంకటగిరియుల్లో సంతోషం

వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ప్రత్యేక చొరవతో మూడవ విడత ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు మంజూరైనాయి. వెంకటగిరి మునిసిపాలిటీలో మూడవ విడత ఎంపికైన 8వవార్డులో ఇందిరమ్మ గృహాలకు సంబంధించి పట్టాలు పంపిణీ జరగలేదు. ఇళ్లు మంజూరై నాలుగు సంవత్సరాలు కావస్తున్నా అధికారులు మాత్రం స్పందించడం లేదు. ఇటీవల జరిగిన ప్రజాపథంలో ఎన్టీఆర్‌కాలనీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. 728 మంది లబ్దిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీకి కలెక్టర్ అంగీకరించడం జరిగింది.


మొగళ్లగుంట సమీపంలో 23 ఎకరాలు సేకరించారు. ఆమోదం పొందిన లేఅవుట్ ప్రకారం 525 మందికి మాత్రమే ఇంటి స్థలాలు కేటాయించే అవకాశం వుంది. హైదరాబాద్‌లోని కంట్రీప్లాన్ అధికారుల నుంచి ఆమోదం లభిస్తే అందరికి అవకాశం కల్పిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని ఆయన అధికారులను కోరారు.

పెసర పంటకు తెగుళ్లు

పెసరపంటకు తెగులు సోకడంతో జిల్లాలోని పలు ప్రాంతాలలోని రైతాంగం తీవ్రంగా నష్టపోతోంది. వరి సాగు చేసే రైతులు అంతో ఇంతో ఆర్థికంగా తోడ్పాటు లభిస్తుందన్న ఆశతో పెసరసాగు చేస్తారు. ఈ ఏడాది ఆ విధంగానే పెసర వేసిన రైతులకు తెగుళ్ల బెడద వేధిస్తోంది. రెండోపంట తర్వాత దుక్కిదున్ని పెసర చల్లితే తెగుళ్లు వుండవని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెప్తున్నా తెగుళ్లు ఆశిస్తూనే వున్నాయి. ఎల్లోమొజాయిక్ తెగులు కారణంగా పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. అధికారులు మాత్రం రైతులు పాతపద్ధతిలో విత్తనాలు చల్లడం వలనే ఈ తెగుళ్లు సోకుతున్నాయని చెప్తున్నారు. గత ఏడాది ఇలాగే తెగుళ్లు చుట్టుముట్టడంతో నష్టపోయిన రైతులు ఈ ఏడాదైనా వ్యవసాయశాఖ సూచనలు పాటించి వుంటే తెగుళ్ల నుంచి పంటను కాపాడుకొని వుండేవాళ్లు. ఇప్పటికైనా రైతాంగం తగిన జాగ్రత్తలు పాటించి పెసర పంటను కాపాడుకోవాల్సి వుంది.

ప్రచారంలో కంభం

స్పందన అంతంత మాత్రం



ఉదయగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున ఎన్నికల బరిలో వున్న కంభం విజయరామిరెడ్డి ముఖ్యనేతలను కలిసి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. మొన్న ఎన్నికల వరకు తెలుగుదేశం పార్టీలో వున్న కంభం ఈ ఉప ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్‌పార్టీలో చేరి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నారు. ఎన్నికల బరిలో వున్న నన్ను గెలిపించండంటూ అందరికి విజ్ఞప్తి చేస్తున్నాడు. సీతారాంపురం మండల మాజీ జడ్పీటిసి దుగ్గిరెడ్డి గురవారెడ్డి, ఉదయగిరి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పి.సి అల్లూరు రాజు, చెంచలబాబు యాదవ్ తదితరులను కలసి మద్దతు కోరారు. ఈ సందర్భంగా కంభం మాట్లాడుతూ మేకపాటి సోదరులు గతంలో పార్టీలు మారిన ప్రతిసారి ఓటమి పాలైనారని గుర్తు చేశారు. ఈ దఫా కూడా వారికి ఓటమి తప్పదన్నారు. మంత్రి ఆనం ఆదేశాల ప్రకారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి చొరవతో తాను కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు చెప్పారు. అయితే నియోజకవర్గ ప్రజలు కంభం పోటీ చేయడంపై చెవులు కొరుక్కుంటున్నారు.

మత్స్యకారుల ఆకలి కేకలు!

వేట నిషేధంతో...

ప్రభుత్వం వేటపై నిషేధం విధించడంతో మత్స్యకారులు జీవనోపాధి కోల్పోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో 12 తీర ప్రాంత మండలాల్లో 111 మత్స్యకార గ్రామాలున్నాయి. 25వేల మత్స్యకార కుటుంబాలు చేపల వేటపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. ప్రభుత్వం వేటపై ప్రతి ఏడాది ఏప్రెల్ నుంచి మే వరకు నిషేధం విధిస్తుంది. ఫలితంగా మత్స్యకారులు పని దొరక్క అల్లాడిపోతున్నారు. వీరిని ఆదుకొనేందుకు ప్రత్యేక పథకాలను అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ అవేవీ ఆచరణకు నోచుకోవడం లేదు. ప్రత్యేక ప్యాకేజీ క్రింద బియ్యం పంపిణీ చేయడంతోపాటు పునరావాసం క్రింద ఆర్థిక సహాయం అందజేయాల్సి వున్నా ఇంత వరకు ఆ దిశగా చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. ఫలితంగా మత్స్యకారుల పరిస్థితి దయనీయంగా మారింది. ఉపాధిహామీ పథకం మత్స్యకారుల దరిచేరడం లేదు. జిల్లావ్యాప్తంగా ఉపాధి పనులు జరుగుతున్నా మత్స్యకార గ్రామాల్లో మాత్రం చేయడం లేదు. తీర ప్రాంతాల్లోని ఇసుక నేలల్లో పనులు చేపట్టడంపై ప్రభుత్వం ఆంక్షలు విధించిందని చెప్పి చేతులు దులుపుకొంటున్నారు అధికారులు. అటు వేటలేక, ఇటు పనులు దొరక్క మత్స్యకారులు తీవ్ర అగచాట్లు పడుతున్నారు.

దోమలు బాబోయ్ దోమలు

అల్లాడుతున్న కావలీయులు

కావలి పట్టణంలో దోమల బెడద ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. మునిసిపాలిటీ పరిధిలో దోమల నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. జిల్లాలోనే కావలి ప్రాంతం దోమలకు ప్రసిద్ధి. షుమారు 70వేల జనాభా గల ఈ పట్టణంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా వుండడంతో దోమల పెంపక కేంద్రంగా మారిపోయింది. వీటి నివారణకు ఫాగింగ్ చేయాల్సివుండగా ఆ మిషన్లు అమర్చిన వాహనాలు ఎక్కడా కన్పించడంలేదు. రికార్డుల్లో మాత్రం దోమలను అరికట్టేందుకు, పారిశుధ్యాన్ని మెరుగుపరచేందుకు ఖర్చు పెడుతున్నట్లు చూపుతున్నా వాస్తవ పరిస్థితులు మాత్రం అందుకు విరుద్ధంగా వున్నాయి. దోమల వలన నిద్ర లేకుండా పోవడంతోపాటు పలురకాల విషజ్వరాల బారినపడి ఆస్పత్రి పాలవుతున్నారు. ప్రతి కుటుంబం దోమల నుంచి రక్షణ పొందేందుకు మస్కిటో కాయిల్స్, జెట్ తదితరాల కోసం అధికంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇప్పటికైనా మునిసిపాలిటీ సిబ్బంది కుంభ కర్ణ నిద్ర వదలి దోమల నివారణకు గట్టి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుకొంటున్నారు.

జగన్ వెంటే జనం [మేకపాటి స్పష్టీకరణ]

రాష్ట్రవ్యాప్తంగా ప్రజలంతా జగన్‌వైపు వుంటే నాయకులు మాత్రమే ఆయా పార్టీల్లో వున్నారని మాజీ ఎమ్పీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి అభిప్రాయ పడ్డారు. జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసేందుకు జనమంతా సిద్ధంగా వున్నా రన్నారు. ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన సోదరుడు, ఉదయగిరి నియోజక వర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డితో కలసి జలదంకి మండలంలోని చామదల, బ్రాహ్మణక్రాక, చిన్నక్రాక, కోదండరామపురం గ్రామాలలో పర్యటించారు. తెలుగుదేశం, కాంగ్రెస్‌పార్టీలు ఎన్ని కుట్రలు పన్నినా ప్రజల్లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పట్ల వున్న అభిమానాన్ని, జగన్‌పై వున్న ప్రేమను చెరిపేయలేరన్నారు. వైఎస్ చేపట్టిన ఎన్నో సంక్షేమ పథకాలు పేదలకు ఎంతో లబ్ధి చేకూర్చాయన్నారు. ఆర్థిక స్థోమత లేక చదువు సాగించలేని వారికి ఫీజు రీయంబర్స్‌మెంట్ ఇచ్చి వారి జీవితాలకు బంగారుబాట వేశా రన్నారు. వైద్యఖర్చులు భరించలేని పరిస్థితుల్లో ఆరోగ్యశ్రీ కార్డు ప్రవేశపెట్టి ఎంతోమంది జీవితాలకు ప్రాణం పోశారని కొనియాడారు. అత్యవసర వైద్యం అందించేందుకు 108, 104 సేవలు ప్రవేశపెట్టిన ఘనత వైఎస్‌దేనన్నారు. అలాంటి పాలన రావాలన్నా, ఆయన ఆశయాలు కొనసాగాలన్నా వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

ఘనంగా నరసింహస్వామి ఉత్సవాలు!

రాపూరు మండలం పెంచలకోనలో వెలసియున్న పెనుశిల లక్ష్మీనరసింహస్వామి జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాలకు మనజిల్లాతోపాటు కడప, చిత్తూరు, జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు హాజరైనారు. పురాతనమైన ఈ ఆలయానికి భక్తులు విరివిగా వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే వెంకటగిరి సమీపంలోని వల్లివేడు వద్ద నరసింహస్వామి ఆలయం మరొకటి వుంది. ఇక్కడ కూడా గ్రామస్తులు ప్రతి ఏటా జరిపే ఉత్సవాలకు 9వ బెటాలియన్ పోలీసులు సహకారం అందిస్తుంటారు.

ఎరువుల బస్తాలు గల్లంతు


మారంరెడ్డిపల్లి సొసైటీ తనిఖీలో తేలిన నిజం

సీతారామపురం మండలంలోని మారంరెడ్డిపల్లి వ్యవసాయ సహకార పరపతి సంఘంలో 274 ఎరువుల బస్తాలు గల్లంతయ్యాయి. వాటికి సంబంధించి 1,29,398 రూపాయల నగదు స్వాహా చేశారట. ఈ విషయాన్ని కావలి కోఆపరేటివ్ బ్యాంక్ డిప్యూటి రిజిస్ట్రార్ కె.అంజిరెడ్డి తెలిపారు. మారంరెడ్డిపల్లి వచ్చిన ఆయన విఎస్ఎస్‌ను తనిఖీ చేసి స్టాక్ వివరాలను పరిశీలించారు. అందులో ఎరువుల బస్తాల నిల్వల్లో తేడా వుండడంతో సొసైటీ పాలకవర్గం నియమించుకొన్న ప్రైవేట్ ఉద్యోగి కాశయ్యను ప్రశ్నించడంతో అతను సరిగా సమాధానం చెప్పలేక నీళ్లు నమిలాడు. ఎరువుల బస్తాలు రైతులకు విక్రయించానని, దానికి సంబంధించిన నగదు తన వద్దే వుందని చెప్పడంతో ఆ నగదు తీసుక రమ్మని డిప్యూటి రిజిస్ట్రార్ చెప్పగా డొంకతిరుగుడు సమాధానం చెప్పడంతో ఆగ్రహించిన ఆయన సొసైటీ అధ్యక్షుడు పాణెం వెంకటరమణయ్య బస్తాల గోల్‌మాల్‌పై ప్రశ్నించాడు. గతంలోనూ ఈ సొసైటీలో పలు అవకతవకలు జరిగాయని, సొసైటీ అధ్యక్షుడుగా వుండి నీవు ఏమీ చేస్తున్నావు అని నిలదీయడంతో గందరగోళం నెలకొనింది. ఎరువుల బస్తాలు గల్లంతైన ఘటనపై విచారణ జరిగి స్వాహా అయిన మొత్తం రాబట్టేందుకు తగిన చర్యలు తీసుకొంటామన్నారు.

వాళ్లు చేసిందేమిటి?

• సిపిఎం నేతల విమర్శ

నెల్లూరు పార్లమెంటు ఎన్నికల బరిలో వున్న కాంగ్రెస్, తెలుగుదేశంపార్టీ, వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థులందరూ ధనవంతులు, పారిశ్రామికవేత్తలేనని సిపిఎం సీనియర్ నేత జక్కా వెంకయ్య అన్నారు. వీరెవరూ జిల్లా అభి వృద్ధికి, ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. కోవూరు నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య కళ్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి టి.సుబ్బిరామిరెడ్డి హైదరాబాద్, విశాఖపట్టణాల్లో కోట్లు సంపాదించారే తప్ప నెల్లూరు జిల్లాలోని ఏ ఒక్క ప్రాంతానికీ చిల్లిగవ్వ సహాయం చేయలేదన్నారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి వంటేరు వేణు గోపాలరెడ్డి నకిలీ విత్తనాలు అమ్మి రైతులను మోసం చేసి కోట్లు సంపాదించారని ఆరోపించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఎమ్పీగా వున్న కాలంలో జిల్లాకు ఎటువంటి ప్రయోజనం కలుగలేదన్నారు. అలాంటి వీళ్లు తిరిగి ఎన్నికలలో పోటీ చేస్తున్నారని, మందీ మార్బలంతో విచ్చలవిడిగా మద్యం, డబ్బుపంపిణీకి సిద్ధంగా వున్నారన్నారు. కార్యకర్తలు ఎల్లవేళలా అప్రమత్తంగా వుండాల న్నారు. సిపిఎంకు 2004లో వచ్చిన ఓట్లు 2012 ఎన్నికల్లో రాలేదని, దీనికి గల కారణాలు సమీక్షించుకొని పార్టీకి పూర్వ వైభవం తీసుకొని రావాలని పిలుపునిచ్చారు. సిపిఎం పార్ల మెంటు అభ్యర్థి చంద్ర రాజగోపాల్ మాట్లాడుతూ ప్రజా సమ స్యలు పరిష్కరించడంలో చొరవ చూపాలన్నారు. ప్రధానపార్టీ అభ్యర్థుల గెలుపుకోసం చేస్తున్న యత్నాలను ప్రజలు గమ నిస్తున్నారని తగిన గుణపాఠం చెప్తారన్నారు. ఈ సమావే శంలో స్థానిక నాయకులు వెంకమరాజు, దయాకర్, మస్తా నయ్య, శ్రీనివాసులు, శేషమ్మ, గోపాల్ తదితరులు పాల్గొ న్నారు.



ధార్మిక చింతనతో ప్రజాసేవ



పదవులాశించడం నా అభిమతం కాదు. పేదల సంక్షేమాన్ని మరింతగా కొనసాగించడం కోసమే రాజకీయాలలోకి వచ్చాను. నా పేరుని, పలుకుబడిని స్వంతానికి ఎప్పుడూ వినియోగించుకోలేదు.

సుమారు యాభై అయిదు సంవత్సరాలుగా సామాజిక సేవలో నిమగ్నమైన వ్యక్తి. కళా సాంస్కృతిక రంగాలలో వున్నా, రాజకీయాలలో వున్నా, ఆధ్యాత్మికంగా ఎడుగుదల సాధిస్తున్నా ఇదంతా తాను సామాన్యుడి సేవ కోసమే వినియోగిస్తున్నానని సగర్వంగా చెప్పుకుంటారు డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డి. ఆయన పేరు గుర్తుకు వస్తే చాలు, దాదాపు ప్రతి రంగమూ మన కళ్ల ముందు కదులుతుంది. గత 16 ఏళ్ల నుంచి రాజ్యసభ సభ్యుడిగా వుండడమే కాకుండా, కొద్ది కాలం కేంద్రంలో మంత్రిగా కూడా పని చేశారు. ఎప్పుడూ పేదవారికి ఏదో ఒక సహాయం చేస్తూ కనిపించే సుబ్బరామిరెడ్డి 'టి.సుబ్బరామిరెడ్డి లలిత కళాపరిషత్', 'సుబ్బరామిరెడ్డి సేవా పీఠం'లను ఏర్పాటు చేసి తన సేవలను కొనసాగిస్తున్నారు. వీటన్నిటితోపాటు ఆయన ఓ పారిశ్రామికవేత్త. వాణిజ్య వేత్త కూడా. ఆయన యశ్‌చోప్రాతో కలసి 'చాందినీ', 'లమ్‌హే' చిత్రాలను నిర్మించారు. ఆధ్యాత్మిక సంబంధమైన ఆసక్తుల కారణంగా 'భగవద్గీత', 'స్వామి వివేకానంద' చిత్రాలను కూడా నిర్మించారు. రాష్ట్రంలో అతి పెద్దదైన నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నిర్మాణంలో తన 'గాయత్రీ కన్‌స్ట్రక్షన్స్' సంస్థతో కీలక పాత్ర పోషించినందుకు ఆయన ఇందిరా గాంధీ చేతుల మీదుగా స్వర్ణపతకం అందుకున్నారు. ఉత్తమ ఫీచర్ ఫిలిమ్ నిర్మించినందుకు రాష్ట్రపతి నుంచి స్వర్ణకమలం అందుకున్నారు. ఆయనకు రాష్ట్రపతి 'కళా బంధు' బిరుదునిచ్చి సత్కరించారు. ఆయన తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్‌గా పదవీ బాధ్యతలు నిర్వర్తించారు. ఆయనతో మా 'ప్రత్యేక విలేఖరి' చేసిన ఇంటర్వ్యూ ఇది.

ప్రశ్న : బాల్యం ఎలా గడిచింది? బాల్యంలో మీరు సంస్కృతి, సాహిత్యాల మీద ఆసక్తి కనబరచేవారా?

జవాబు : బాల్యం నుంచి భక్తి భావాలు, కళల పట్ల ఆసక్తి వుండేవి. ఇవన్నీ ఎవరి ప్రోత్సాహంతోనో, ఎవరి ప్రభావంతోనో వచ్చినవి కావు. వయసు పెరుగుతున్న కొద్దీ అవి కూడా వేళ్లు పాతుకుపోవడం మొదలైంది. నేను స్వయంకృషితో పైకి వచ్చిన వ్యక్తిని.

ప్రశ్న : చదువుకుంటున్న సమయంలో మీ ఆసక్తులు ఎలా వుండేవి?

జవాబు : చదువుకుంటున్న వయసులో చదువు మీద విపరీతంగా ఆసక్తి వుండేది. పుస్తకాలు బాగా చదివేవాడిని. కళల గురించి చదివి తెలుసుకొనేవాడిని. ముఖ్యంగా ఆధ్యాత్మిక సంబంధమైన పుస్తకాలు ఎక్కువగా చదివేవాడిని.

ప్రశ్న : మీ భార్యా పిల్లలకు కూడా ఇటువంటి ఆసక్తులున్నాయా?

జవాబు : అవును. వాళ్లకు కూడా ఇవన్నీ అలవాటయ్యాయి. పిల్లలకు విలువలు నేర్పాను.

ప్రశ్న : ఇంతగా ఆధ్యాత్మిక చింతన ఎలా ప్రారంభమైంది?

జవాబు : చిన్నప్పుడే అది తెలియకుండానే ప్రవేశించింది. 'భూకైలాస్' అనే చిత్రం నన్ను ఆధ్యాత్మికంగా ప్రభావితం చేసింది. ఆ చిత్రంలో రావణాసురుడు శివుడ్ని ప్రసన్నం చేసుకున్నట్లుగా... నేను ఎందుకు చేయలేను అనే తపనతో... కఠోరమైన దీక్షతో శివారాధన చేశాను. ఎప్పుడు ఏమాత్రం అవకాశం వచ్చినా, సమయం దొరికినా ఆధ్యాత్మిక భావనలు నన్ను చుట్టుముడుతుంటాయి. ఉదయమే లేచి, రెండుగంటలపాటు జపం చేసుకుంటాను. రోజూ ప్రాణాయామం చేస్తాను. ఎప్పుడు ఒంటరిగా వున్నా మనసులో మంత్ర జపం చేసుకుంటుంటాను. విశాఖపట్నంలో నేను ఎప్పుడు శివాలయంలో ప్రవేశించినా నాలో ప్రకంపనలు కలుగుతుంటాయి. మైమరచిపోతుంటాను. కలల్లో తరచూ భగవంతుడు సాక్షాత్కరిస్తుంటాడు. ఆ విషయంలో నేను ఎంతో అదృష్టవంతుడిననుకుంటాను. తరచూ సాధువుల్ని, సిద్ధపురుషుల్ని కలుసుకుంటూ వారి ఆశీస్సులు తీసుకుంటుంటాను.

ప్రశ్న : ఒకవైపు ఆధ్యాత్మిక చింతన, మరోవైపు రాజకీయ ప్రవేశం - విచిత్రంగా అనిపించడం లేదా?

జవాబు : ఇందులో విచిత్రమేమీ లేదు. సామాన్యుడికి సేవ చేయాలనేది నా దీక్ష. రాజకీయాలు నన్ను సామాన్యులకు మరీ సన్నిహితం చేశాయి. వారికి సేవ చేయడానికి మరింత అవకాశం కలిగింది. ఏ రంగంలో వున్నా ఆ రంగాన్ని పేదల శ్రేయస్సుకే ఉపయోగించాలన్నది నా ఉద్దేశం. దానికే నేను కట్టుబడి వున్నా. ఇక ఆధ్యాత్మిక చింతన అంటారా, అది రాజకీయాలకేమీ అడ్డురాదు.

ప్రశ్న : రాజకీయంగా మీ లక్ష్యమేమిటి? మీ రాజకీయ 'స్ఫూర్తిదాత' ఎవరు?

జవాబు : చెప్పాను కదా, రాజకీయాలో ప్రవేశిస్తే పేదల సంక్షేమాన్ని మరింతగా కొనసాగించవచ్చని నా ఉద్దేశం. మరింతగా జనంలోకి వెళ్లడానికి, వాళ్ల సాధకబాధకాలు తెలుసుకోవడానికి నాకు మార్గం సుగమమైంది. పదవులను ఆశించడం నా అభిమతం కాదు. రాజకీయ రంగంలో నా గురువు రాజీవ్‌గాంధీ, నెహ్రూ శతజయంతి సంవత్సరమైన 1989లో నేను ఓ రోజు రాత్రి 11 గంటలకు ఢిల్లీలో రాజీవ్ గాంధీని మొట్టమొదటిసారిగా కలుసుకున్నాను. వెంటనే ఆయన అభిమానినయ్యాను. నా అభిమానులు, అనుచరులతో ఆయనకు మద్దతిచ్చాను. ఇప్పటికీ ఆయన ఆశయాలను నెరవేర్చడానికే నేను కట్టుబడి వున్నాను.

ప్రశ్న : ఏ ఆశయంతో, ఏ లక్ష్యంతో రాజకీయ ప్రవేశం చేశారో ఆ లక్ష్యాన్ని సాధించారా? ఎంత దూరంలో వున్నారు?

జవాబు : రాజకీయంగా నాకు పెద్ద లక్ష్యాలంటూ ఏమీ లేవు. రాజకీయాల కారణంగా సామాన్యులకు కొంత దగ్గరయ్యాను. అధికారం మూలంగా మరింత దగ్గర కాగలిగితే అదీ మంచిదే. నేను ప్రత్యేకంగా దేని కోసమూ ఆరాటపడడమంటూ వుండదు.

ప్రశ్న : పేదల కోసం మీరు చేపట్టిన కార్యక్రమాలు ఏమిటి?

జవాబు : విశాఖపట్నంలో నీటి సరఫరా పథకాలు చేపట్టాను. ఆలయాలు నిర్మించాను. ఆలయాల పునరుద్ధరణకు సహాయ సహకారాలు అందజేశాను. అనేక పెండింగ్ ప్రాజెక్టులకు అనుమతి సంపాదించడానికి కృషి చేశాను. ప్రజా సమస్యలు పరిష్కరించడానికి అహర్నిశలూ ప్రయత్నిస్తూనే వుంటాను.

ప్రశ్న : జాతీయ స్థాయిలో మీకు పేరు ప్రఖ్యాతులున్నాయి. బాగా పలుకుబడి వుంది. వీటిని వుపయోగించుకుని, సేవాపథకాలు ఏమైనా చేపట్టే అవకాశం వుందా?

జవాబు : నా పేరుని, నా పలుకుబడిని సొంతానికి వుపయోగించుకోవడం చాలా అరుదు. నా ప్రాంతానికి పథకాల కోసం, నాప్రాంత అభివృద్ధికి నిధుల కోసం, రాష్ట్ర సంక్షేమం కోసం మాత్రమే నా పలుకుబడిని ఉపయోగించుకుంటుంటాను.

ప్రశ్న : తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్‌గా వున్నప్పుడు అక్కడ తీసుకువచ్చిన మార్పులేమిటి? మీకు ఆ పదవి సంతృప్తిని ఇచ్చిందా?

జవాబు : తిరుమలలో వుండగా నేను భక్తుల సౌకర్యాలు పెంచడానికి బాగా కృషి చేశాను. సంపన్నుల నుంచి, పారిశ్రామికవేత్తల నుంచి, వాణిజ్య వేత్తల నుంచి నిధులు సేకరించి, భక్తులకు వసతి సౌకర్యాలు పెంచడానికి ఖర్చు చేయించాను. ప్రముఖులకు ఎక్కువగా దర్శనాలు ఏర్పాటు చేస్తున్నానని నా మీద విమర్శలు వచ్చాయి. కానీ, నా ఉద్దేశం మాత్రం భక్తులకు సౌకర్యాలు పెంచడానికి నిధులు సమీకరించాలన్నదే.

ప్రశ్న : కళా సాంస్కృతిక రంగాల్లో తీసుకరాదలచుకున్న మార్పులేమిటి? వీటి మీద మీ ముద్ర ఎలా వేయబోతున్నారు?

జవాబు : స్థానికంగా కళలను, కళాకారులను ప్రోత్సహించడానికి ఏం చేస్తే బాగుంటుందా అని ఆలోచిస్తున్నాను. నేను స్థాపించిన కళాపీఠం ద్వారా కళాకారులను ఆదుకోవాలని, వారికి పూర్వవైభవం తెచ్చిపెట్టాలని ఆలోచిస్తున్నాను. ఒక్క హైదరాబాద్‌లోనే కాక, చిన్న పట్టణాలలో సైతం కళాప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించదలచుకున్నాను. అదే విధంగా, జిల్లా ప్రధాన కేంద్రాలలో వచ్చే మూడు నాలుగేళ్లలో కళావేదికలను, కళా భవనాలను నిర్మించాలనుకుంటున్నాను. మెగా కల్చరల్ ఫెస్టివల్స్‌ను నిర్వహిస్తాను.









ఆత్మకూరు సభకు పోటెత్తిన జన సందోహం!

■ ఆత్మకూరును అభివృద్ధి చేస్తా : సిఎం! ■ శ్రీకాళహస్తి - నడికుడి రైల్వేలైనుకు శంకుస్థాపన చేయిస్తా: టిఎస్ఆర్ ■ మేకపాటి సోదరులు చేసిందేమిటి: రామనారాయణరెడ్డి

15వ తేది ఆత్మకూరులో ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డి నెల్లూరు పార్లమెంటు స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న డాక్టర్ తిక్కవరపు సుబ్బరామిరెడ్డికి కార్యకర్తలకు పరిచయం చేసేందుకు ఏర్పాటుచేసిన సదస్సు బహిరంగ సభగా మారిపోయింది. అదరగొడుతుండిన ఎండను సైతం ప్రజలు లెక్కచేయక నెల్లూరుపాళెం, ఆత్మకూరుల నుంచి వేల సంఖ్యలో సభకు తరలి రావడంతో ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆర్థికమంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు పార్లమెంటు స్థానం కాంగ్రెస్ అభ్యర్థి తిక్కవరపు సుబ్బరామిరెడ్డి ఉత్సాహవంతమైన ఉపన్యాసాలతో జనాన్ని హోరెత్తించారు.

పచ్చి అబద్ధాలు చెబుతున్న జగన్

రాష్ట్రంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం వైఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఏ పథకాన్నీ ఆపక రెట్టింపు ఉత్సాహంతో ముందుకు సాగుతుంటే వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మాత్రం ప్రభుత్వంపై పచ్చి అబద్ధాలతో పనికిమాలిన విమర్శలు చేస్తున్నాడని ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డి విమర్శించారు. ఈ యేడాది చదువుకొనే పిల్లల స్కాలర్‌షిప్పుల కోసం ఐదువేల కోట్ల రూపాయలు ఇచ్చాం. 12 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం. ఆరోగ్యశ్రీ పథకం కోసం ఈ యేడాది 1,380 కోట్ల రూపాయలను వెచ్చించి నాలుగు లక్షల మందికి ఆపరేషన్లు చేయించినట్లు చెప్పారు. రాజకీయాలు భ్రష్టుపట్టాయని చెబుతున్న జగన్మోహన్‌రెడ్డి అవి ఎవరి ప్రవేశం వల్ల భ్రష్టు పట్టాయో తెలుసుకొని మాట్లాడితే బాగుంటుందన్నారు.

సామాన్యులను కలవని మేకపాటి!

ఆర్థిక మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఈ సభలో మేకపాటి సోదరులపై నిప్పులు చెరిగారు. ఆయన ఎమ్మిగా గెలిచి మూడేళ్లయ్యింది. ఏనాడైనా సామాన్యులతో వచ్చి మాట్లాడాడా? ఆయన ఎవరితోనైనా కరచాలనం చేస్తే చేతి గుడ్డతో తుడుచుకొంటాడు. ఈ మూడేళ్లుగా ఎమ్మిగా ఉండి నెల్లూరుకు ఏంచేశాడు? ఆత్మకూరు అభివృద్ధికి ఎన్నో నిధులను ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి మంజూరు చేశారని, ఈ పనుల పరంపర కొనసాగాలంటే కేంద్రంలోనూ తనకు ఒక తోడు కావాలని దీనికోసం ఎమ్మిగా సుబ్బరామిరెడ్డిని గెలిపించమన్నారు.

అభివృద్ధి చేసి చూపిస్తా!

తనను ఎమ్మిగా గెలిపిస్తే ఆత్మకూరులో అభివృద్ధిని కళ్లకు కట్టినట్లు చేసి చూపిస్తానని తిక్కవరపు సుబ్బరామిరెడ్డి చెప్పారు. ఎందలోనూ బహిరంగసభకు వేలాదిగా తరలివచ్చిన జనానికి మంచి పనులు చేసి రుణం తీర్చుకొంటానన్నారు. నేను 16 ఏళ్లుగా ఎమ్మిగా కొనసాగుతున్నాను. రెండు సార్లు లోక్‌సభకు, రెండు సార్లు రాజ్యసభకు ఎన్నికయ్యాను. నేను రబ్బర్ స్టాంప్ ఎమ్మిను కాను. పార్లమెంటు స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌గా పనిచేస్తున్నాను. సోనియాగాంధీ నెల్లూరులో పోటీ చేయమంటే వచ్చి పోటీ చేస్తున్నాను. కాంగ్రెస్ పార్టీ పేదల సంక్షేమం కాంక్షించే పార్టీ. పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టింది. జన్మభూమి రుణం తీర్చుకోను నెల్లూరు వచ్చిన నన్ను పార్లమెంటు సభ్యుడిని చేస్తారన్న నమ్మకం ఉందన్న ఆత్మవిశ్వాసాన్ని సుబ్బరామిరెడ్డి ఈ సభలో వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌లో వేణుగోపాల్ నాయుడు

కరటంపాడుకు చెందిన లగడపాటి వేణుగోపాల్‌నాయుడు ఈ సభలో ముఖ్యమంత్రి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆత్మకూరు మాజీ శాసనసభ్యుడు శ్రీహరినాయుడు, పార్టీ నాయకులు రమణారెడ్డి, జ్యోతి గురవయ్య, డాక్టర్ ఆదిశేషారెడ్డి, తాళ్లూరు గిరినాయుడు, పుట్టం బ్రహ్మారెడ్డి తదితరులు వేదికపై ఆశీనులయ్యారు.



ఆత్మకూరు సభలో మాట్లాడుతున్న సిఎం. వేదికపై టిఎస్ఆర్, వాకాటి నారాయణరెడ్డి, మాదాల జానకిరాం.



సిఎం, ఆర్థికమంత్రి రామనారాయణరెడ్డి, టిఎస్ఆర్‌లను గజమాలతో సత్కరిస్తున్న డాక్టర్ ఆదిశేషయ్య బృందం.

తొలి సభలోనే శుభశకునం!

- కలిగిరి సభ సూపర్ సక్సెస్.
- పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన పార్టీ కార్యకర్తలు.
- నెల్లూరులో కాంగ్రెస్‌దే విజయం: బొత్స
- ఫ్లోరిన్ సమస్యను పరిష్కరిస్తా: టిఎస్ఆర్

నెల్లూరు పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తిక్కవరపు సుబ్బరామిరెడ్డి 10తేది మెట్ట ప్రాంతమైన కలిగిరిలో చేసిన తొలి పర్యటనకు విశేష జనస్పందన లభించింది. ఈ సందర్భంగా కలిగిరిలో జరిపిన బహిరంగ సభలో పిసిసి అధ్యక్షుడు బొత్స సత్యనారాయణ, ఆర్థికమంత్రి ఆనం రామనారాయణరెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పితాని సత్యనారాయణ, సర్వేపల్లి ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, ఇన్‌ఛార్జి డిసిసి అధ్యక్షుడు చాట్ల నరసింహారావు, నెల్లూరు సెంట్రల్ బ్యాంక్ అధ్యక్షుడు శ్యాంసుందరరెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు మాదాసు గంగాధరం, బూదాటి రాధయ్య, మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ జడ్పీ ఛైర్మన్ చెంచలబాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు. కలిగిరి ప్రాంత కాంగ్రెస్ నాయకులు ఎమ్మీ రామిరెడ్డి, కావ్యకృష్ణారెడ్డిల నేతృత్వంలో ఈ సభ జరిగింది.

కాంగ్రెస్‌దే విజయం

ఈ సభలో పిసిసి అధ్యక్షుడు బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజల అభ్యున్నతి కోసం పని చేసే కాంగ్రెస్‌ను గెలిపించమని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రం కరవు కాటకాలలో వుండి, ప్రజలు అభివృద్ధి కావాలని కోరుతుంటే జగన్ మోహన్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు ఎన్నికలు కావాలని కోరుకున్నారు. ఈ ఎన్నికలు దేని కోసం వచ్చినవో, ఏమి సాధించడానికి వచ్చినవో సమాధానం చెప్పాల్సిన బాధ్యత జగన్, చంద్రబాబులకు వుందన్నారు. నెల్లూరు పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేస్తున్న తిక్కవరపు సుబ్బరామిరెడ్డి గెలుస్తారన్న నమ్మకం సభలోని జనస్పందన చూస్తే అర్థమవుతుందన్నారు.

మేకపాటి బ్రదర్స్ అవినీతిపరులు

ఆర్థికమంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ అనసరంగా ఎన్నికలకు కారకులైన మేకపాటి సోదరులు ఎక్కడ మీటింగ్ పెట్టినా ఆనం సోదరులను పోటీకి రమ్మంటున్నారు. మేం పార్టీలు మారలేదు. గెలిపించిన ప్రజలకు ఐదేళ్ల సేవ చేస్తామన్నారు. ఉదయగిరి వెళ్తే మేకపాటి సోదరులు చేసిన అవినీతి, అక్రమాలు, భూ కబ్జాలు తెలుస్తాయన్నారు. ప్రజల హృదయాల్లో కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా వుంటుందని రామనారాయణరెడ్డి నొక్కి చెప్పారు.



కలిగిరి సభా వేదికపై చిరునవ్వులు చిందిస్తున్న కంభం, టిఎస్ఆర్, పిసిసి అధ్యక్షుడు బొత్సా సత్యనారాయణ.

ఫ్లోరిన్ సమస్య పరిష్కరిస్తా!

ఉదయగిరి నియోజకవర్గంలోని పదమటి పల్లెలను పట్టి పీడిస్తున్న ఫ్లోరిన్ నీటి సమస్యను లేకుండా చేస్తానని తిక్కవరపు సుబ్బరామిరెడ్డి ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. కలిగిరి సభలో ఆయన మాట్లాడుతూ ఫ్లోరిన్ సమస్య నివారణ కోసం ఒకవేళ ప్రభుత్వం నిధులు ఇవ్వకపోయినా తన సొంత నిధులతోనైనా ఫ్లోరిన్ సమస్యను పరిష్కరిస్తాననేసరికి సభా ప్రాంగణం చప్పట్లతో మారుమోగింది. సోనియాగాంధీ పోటీ చేయమని చెబితేనే ఇక్కడ పోటీ చేస్తున్నానని తనను గెలిపిస్తే నెల్లూరు రూపు రేఖలు మారుస్తానని సుబ్బరామిరెడ్డి గట్టిగా చెప్పారు.

వారఫలాలు

తేది 19-05-2012 నుండి 25-05-2012 వరకు మేషంలో బుధుడు 21తేది వరకు తదుపరి వృషభంలో; వృషభంలో రవి, గురు, శుక్ర, కేతువులు; సింహంలో కుజుడు; కన్యలో శని; వృశ్చికంలో రాహువు; మేష, వృషభ, మిథునాలలో చంద్రుడు సంచరిస్తారు.

పంచాంగం

19తేది మాస శివరాత్రి.
20తేది భౌనామాస్య.
21తేది కరవీర వ్రతం.
23తేది రంభా వ్రతం, రజబ్ నెల ప్రారంభం.

శుభ ముహూర్తాలు

23తేది సీమంత, అన్నప్రాసనలకు సుముహూర్తాలున్నాయి. గురుమూఢమి కారణంగా వివాహాది శుభకార్యాలకు సుముహూర్తాలు లేవు.

మే తిథులు

వైశాఖ బహుళ

19	శని	చతుర్దశి	రా	02.20 గం.ల.వ
20	ఆది	అమావాస్య	తె	05.12 గం.ల.వ

జ్యేష్ఠ శుద్ధ

21	సోమ	పాడ్యమి		పూర్తిగా
22	మంగళ	పాడ్యమి	ఉ	07.42 గం.ల.వ
23	బుధ	తదియ	ప	09.55 గం.ల.వ
24	గురు	చవితి	ప	11.47 గం.ల.వ
25	శుక్ర	త్రయోదశి	రా	01.14 గం.ల.వ

అక్కరాజు బాలసుబ్రహ్మణ్యం
7/34, దొడ్లసుబ్బారెడ్డి నగర్, నవలాకులతోట, నెల్లూరు – 2. సెల్: 95819 76599.

మేషం
అశ్వని, భరణి, కృత్తిక 1 పా

ఈ రాశి వారు తలపెట్టిన పనులను పట్టుదలతో పూర్తి చేస్తారు. కీలక విషయాలలో ఆత్మీయుల సలహాలు తీసుకొంటారు. ఇంటా బయట గౌరవ ప్రతిష్టలు పెరుగుతాయి. విద్యార్థుల ప్రతిభకు తగిన గుర్తింపు వుంటుంది. వ్యవసాయదారులు పనులలో నిర్లక్ష్యం వహించ రాదు. కళా, క్రీడా రంగాలలోని వారికి మనోవిచారం, అధికశ్రమ, పై అధికారుల ఒత్తిడి వుంటుంది.

వృషభం
కృత్తిక 2,3,4 పా, రోహిణి, మృగశిర 1,2 పా

అన్ని పనులు సకాలంలో పూర్తి చేస్తారు. వృత్తి, వ్యాపార, ఉద్యోగాలలోని వారికి ఆర్థిక లాభాలున్నాయి. నిరుద్యోగులు గట్టి ప్రయత్నంతో నూతన అవకాశాలు అందిపుచ్చుకొంటారు. విద్యార్థులకు ఉత్సాహవంతమైన కాలం. వ్యవసాయదారులకు ఆర్థికాదాయం వుంటుంది. రాజకీయాలలోని వారికి అధిక ఖర్చులు, స్వల్ప అనారోగ్య సూచనలు, తోటివారితో కలహాలు ఏర్పడవచ్చు.

మిథునం
మృగశిర 3,4 పా. ఆర్ద్రపునర్వసు,1,2,3 పా

ఈ రాశి వారికి ఆర్థికాదాయం గతంలో కంటే మెరుగ్గా వుంటుంది. విద్యార్థులు తమ భవిష్యత్తు ప్రణాళికలు నేర్పుగా పూర్తి చేసి విజయం సాధిస్తారు. వ్యవసాయ రంగంలోని వారికి అన్నివిధాలా బాగుంటుంది. కళా, క్రీడా రంగాలలోని వారు తమ భవిష్యత్తుకు ఏర్పాట్లు చేసుకోవడానికి తగిన సమయం. రాజకీయ రంగంలోని వారికి ఆకస్మిక ప్రయాణాలు, ప్రోత్సాహం, గుర్తింపు, గౌరవాలుంటాయి.

కర్కాటకం
పునర్వసు 4 పా. పుష్యమి, ఆశ్లేష

కీలక విషయాలలో నిదానంగా ఆలోచించి చేయడం శుభప్రదం. వ్యాపార, ఉద్యోగ రంగాలలోని వారు ఉన్నతాధికారుల సహకారంతో తమ పనులు నెరవేర్చుకోవడానికి తగిన సమయం. ఇంట్లో ఏర్పడిన చిన్నపాటి సమస్యలు సకాలంలో పరిష్కారమౌతాయి. విద్యార్థులు కార్యవిజయంతో ఉత్సాహంగా వుంటారు. వ్యవసాయదారులకు అన్ని విధాలా బాగుంటుంది. రాజకీయులకు బాగుంటుంది.

సింహం
మఖ, పుబ్బ ఉత్తర 1 పా

ఈ రాశి వారు తలపెట్టిన అన్ని పనులలో విజయం, వీరి మాటకు విలువ పెరుగుతుంది. వృత్తి, వ్యాపార రంగాలలోని వారికి ఆర్థిక పరిస్థితి బాగుంటుంది. విద్యార్థులు నూతనోత్సాహంతో ముందుకు వెళ్తారు. వ్యవసాయదారులకు అన్నివిధాల అనుకూలం. కళా, క్రీడా రంగాలలోని వారికి పై అధికారుల ప్రశంసలు, సన్మానాలుంటాయి. రాజకీయ నాయకులు అభిప్రాయభేదాలు రాకుండా చూసుకోవాలి.

కన్య
ఉత్తర 2,3,4పా, హస్త, చిత్తా 1, 2 పా

ఈ వారం చేసే అన్ని పనులు సకాలంలో పూర్తి చేస్తారు. గతంలో చేసిన రుణాలను తీరుస్తారు. కోర్టు లేదా ఇతర చిక్కు వ్యవహారాలకు పరిష్కారం దొరుకుతుంది. గతంలో మిమ్మల్ని దూరంగా వుంచిన వారు తిరిగి సన్నిహితులౌతారు. విద్యార్థులకు ఈవారం చాలా ప్రోత్సాహకరంగా వుంటుంది. కళా, క్రీడా రంగాలలోని వారిని కొన్ని సంఘటనలు బాధిస్తాయి. రాజకీయ రంగంలోని వారికి అననుకూలం.

తుల
చిత్తా 3,4 పా, స్వాతి, విశాఖ 1,2,3 పా

వృత్తి, వ్యాపార, ఉద్యోగాలలోని వారికి ఆర్థిక పరిస్థితి మెరుగ్గా వుంటుంది. కొన్ని సమస్యలు పరిష్కారమౌతాయి. విద్యార్థులు ఉన్నత విద్యకై చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. వ్యవసాయ రంగంలోని వారు అధికశ్రద్ధతో తమ పనులు చేయవలసి వుంటుంది. కళా, క్రీడా రంగాలలోని వారికి విదేశీ పర్యటనలు, మంచి అవకాశాలు వుంటాయి. రాజకీయ రంగంలోని వారికి పనులలో జాప్యం.

వృశ్చికం
విశాఖ 4 పా, అనూరాధ, జేష్ఠ

ఈ రాశి వారికి శుభాశుభ మిశ్రమంగా వుండి పనులు వాయిదా పడతాయి. ఆర్థికంగా సామాన్యంగా వుంటుంది. అవసరానికి డబ్బు చేతికందుతుంది. ఉద్యోగులకు స్థానచలన సమస్యలున్నాయి. విద్యార్థులు పడిన శ్రమకు కొంత వరకు ఫలితం సాధిస్తారు. కళా, క్రీడా రంగాలలోని వారికి ప్రోత్సాహకరంగా వున్నప్పటికీ దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది.

ధనుస్సు
మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా

పనులలో ఆటంకాలెదురౌతాయి. ఎంత కష్టపడ్డా ఫలితం శూన్యం. ఇతరులతో మాట్లాడునప్పుడు జాగ్రత్త వహించాలి. మాట పట్టింపులొస్తాయి. వృత్తి, వ్యాపార రంగాలలోని వారికి శ్రమకు తగ్గ ఫలితం వుంటుంది. ఆర్థిక వ్యవహారాలు మందగిస్తాయి. సంతానం గూర్చి శుభవార్త వింటారు. రాజకీయాలలోని వారు తొందరపాటు తనం వల్ల అపకీర్తి రాకుండా చూసుకొనేది.

మకరం
ఉత్తరాషాఢ 2, 3,4 పా. శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా

వీరికి అన్ని విధాల బాగుంటుంది. తలపెట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ఇంటియందు శుభకార్య యత్నాలు సఫలమౌతాయి. ఆదాయం ఆశించినంత వుంటుంది. పుణ్యక్షేత్రాల సందర్శన చేస్తారు. వ్యవసాయదారులకు లాభిస్తుంది. కళా, క్రీడా రంగాలలోని వారికి అనవసర ఆందోళన వుంటుంది. అయినా గుర్తింపు, గౌరవాలుంటాయి. రాజకీయాలలోని వారు ఇతరులతో జాగ్రత్తగా మెలగాలి.

కుంభం
ధనిష్ఠ 3,4 పా. శతభిషం, పూర్వ భాద్ర 1,2,3 పా

ఈ వారం వీరికి శుభాశుభమిశ్రమంగా వుంటుంది. కొత్తగా పనులు చేపట్టుటకు ఈ వారం అన్ని విధాల అనుకూలం. బంధుమిత్రులను కలుస్తారు. మీ మాటల ధోరణి కొన్ని సమయాల్లో మీకే ఇబ్బందిగా వుంటుంది. విద్యార్థులకు తల్లిదండ్రుల ప్రశంసలు లభిస్తాయి. వ్యవసాయ రంగంలోని వారికి చాలా అనుకూలంగా వుంటుంది. రాజకీయలలోని వారు తమ మాటలతో ప్రత్యర్థులను ఆకట్టుకొంటారు.

మీనం
పూర్వాభాద్ర 4 పా, ఉత్తరాభాద్ర, రేవతి

చాలా అనుకూలమైన వారం. అన్ని పనులు పూర్తి చేస్తారు. దూర ప్రాంతాల నుండి శుభవార్తలు వింటారు. డబ్బు సకాలంలో అందుతుంది. విద్యార్థులు ఆశించిన ఫలితాలు పొందగలరు. వ్యవసాయ చేసేవారికి శ్రమకు తగ్గ ఫలితం అందుతుంది. కళా, క్రీడా రంగాలలోని వారికి గతంలో ఆగిన పనులు పూర్తవుతాయి. రాజకీయాలలోని వారు దీర్ఘకాలంగా వున్న సమస్యల నుండి బయటపడతారు.

ఈశాన్య కుంభ ప్రతిష్ట నిష్ణాతులే చేయాలి!

ఎన్.అనూరాధానాయుడు *తిరుపతి*

* పెద్దబ్బాయి వ్యాపారం బాగా దెబ్బతిన్నది. శ్రీవారు ఆర్థికంగా దివాలా తీశారు.

గృహం, అంగళ్లలో చాలా వాస్తు దోషాలున్నాయి. వాటిని సరిచేసుకోవడం ఒక్కటే మార్గం. ఈశాన్య 'కుంభ' ప్రతిష్ట నిష్ణాతులైన వారు చేస్తేనే ఫలితాలనిస్తుంది.

ఆళ్ల గోపీచంద్ *ఆత్మకూరు*

* వృక్షవేధను గురించి మీరు చాలా ఎక్కువగా చెబుతున్నారు.

ఉన్న విషయమే చెబుతున్నాను. వృక్షాల్ని రక్షించుకోలేకపోతే భవిష్యత్తులో మనల్ని మనం రక్షించుకోవడం దుర్లభం.

ఎమ్.జానకీబాయి *హైదరాబాద్*

* గృహాన్ని కొనుగోలు చేశాక ప్లాటులో చేరి దాన్ని బాదుగకు ఇచ్చాము. పిల్లల సమస్యలున్నాయి.

గృహం, ప్లాటు వాస్తు దోషాలు సరిచేసుకోవాలి. నమ్మినప్పుడు వెంటనే పరిష్కరించుకోవాలి. మీ ప్లానును సరిచేసి పంపిస్తున్నాను.

వై.శంకరరెడ్డి *నెల్లూరు*

* నెల్లూరు స్పిన్నింగ్ మిల్లు లేఅవుట్‌లో మా గృహం ఈశాన్యం చూస్తోంది.

అసలు లేఅవుటే అవాస్తు దోషాల పుట్ట. మూలలు చూడడం వల్ల 'దిక్వేధ' కలిగి పిల్లలు భ్రష్టులవుతారు.

సి.లలితాపద్మిని *బెంగుళూరు*

* నాలుగు రోడ్ల కూడలిలో ఇల్లు. సమస్యలతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నాము.

మూడు, నాలుగు రోడ్ల కూడళ్లు యముని వాకిళ్లని అగస్త్య వాస్తు చెబుతోంది. మీరు వెంటనే సంబంధిత యంత్ర ప్రతిష్ట చేసుకోండి.

కె.ఎన్.ఆర్ *తిరుపతి*

* అమ్మాయి మానసికంగా చాలా అలసిపోయింది. మీ సలహా కోసం ఎదురుచూస్తున్నాము.

మీ సుదీర్ఘమైన ఉత్తరం చదివాను. సుదర్శన యంత్ర ప్రతిష్ట తర్వాత కూడా పరిస్థితి మారకపోతే మీరు మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, న్యాయస్థానాన్ని ఆశ్రయించండి.

ఎం.అరుణ్‌రెడ్డి *సర్వేపల్లి*

* మా నాన్న డిక్టేటరు. అమ్మ అతన్నే సపోర్టు చేస్తుంది. నాన్న పరిస్థితికి కారణం ఏమిటి?

వాయువ్య సెప్టిక్ ట్యాంకు గొయ్యి 'మనోవేధా' కారణం. అది తీసివేస్తేగానీ పరిస్థితి చక్కబడదు. వాస్తులో సూత్రాలుంటాయి. చిట్కాలుండవు.

వాస్తు సందేహాలు సమాధానాలు

ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి
4వ వీధి, గాయత్రినగర్, ఎ.కె. నగర్ పోస్టు, నెల్లూరు-4.
ఫోన్: 2322345, సెల్: 9490125878.

కె.రేవంత్‌రెడ్డి *చెన్నై*

* విదేశాలలో ఉండటం, కోర్టు వ్యాజ్యాల వల్ల రెండున్నరేళ్లు గృహం ఖాళీగా ఉన్నది.

దుష్టశక్తుల ఆవాహనికి మండలం(నలభై) రోజుల 'నిర్జన గృహం' చాలు. మీరు భయపడక సుదర్శన యంత్ర ప్రతిష్ట చేసుకోండి.

వై.వి.విజయ *సికింద్రాబాద్*

* నైరుతిలో మెట్లు, లెట్రిన్ ఉన్నాయి. రోగాలు, మరణాలు ఇంట్లో సహజమైపోయాయి.

మెట్ల క్రింద లెట్రిన్ వాస్తు దోషం. నైరుతి సెప్టిక్ ట్యాంకు వల్ల అనారోగ్యాలు, మరణాలు సాధారణం. యంత్రాలు వద్దు. ట్యాంకును వెంటనే తీసివేయండి.

ఎ.రమణారెడ్డి *జగదేవిపేట*

* యంత్రాలు పనిచేయడం లేదెందువల్ల?

అంగట్లో యంత్రాల పరిస్థితి అంతే! యంత్రం గృహ యజమానుల నక్షత్రాలను బట్టి తయారై బలి, పూజ, సంహారం, వంటి శాస్త్రోక్త విధానాలు జరగాలి.

జట్ల అరుణమ్మ *పెనుగొండ*

* తూర్పు యిల్లు, ఉత్తరం రోడ్డు. ఆమె వల్ల గృహ సమస్యలు వస్తున్నాయి.

రాజవీధులకు విదిక్కుల్లో ఉన్న గృహాలు కొనుగోలు చేయరాదు. అలా చేస్తే 'విదిక్వేధ' పీడిస్తుంది. ఉత్తరం స్త్రీలపై ప్రభావం చూపిస్తుంది. మీరు వాస్తు యంత్రం(ఉచ్చు) ప్రతిష్టించుకోండి.



● సృష్టికర్త

బ్రహ్మకు ప్రీతికరమాసం జ్యేష్ఠమాసం!

వైశాఖం శ్రీ మహావిష్ణువుకు, కార్తీకం శివుడికి ఏ విధంగా ప్రియమైనదో త్రిమూర్తులలో ఒకరైన సృష్టి కర్త బ్రహ్మకు అత్యంత ప్రీతికర మాసం జ్యేష్ఠ మాసం. ఇది చాంద్రమానం ప్రకారం మూడవ నెల. ఈ మాసంలో వచ్చే పూర్ణిమ నాడు చంద్రుడు జ్యేష్ఠానక్షత్ర సమీపంలో సంచరిస్తూ వుండడం వలన ఈనెలకు జ్యేష్ఠ మాసం అని పేరొచ్చిందని చెప్తారు. జ్యేష్ఠమాసం వచ్చిందంటే గ్రీష్మ ఋతువు ఆరంభమవుతుంది. శ్రావణ మాసం తర్వాత మహిళలు చేసే అనేక వ్రతాలకు నెలవైన మాసం ఇది. ఎన్నో శుభాలను కలుగజేసే ఈనెలలో కొన్ని నియమాలను, విధులను పాటిస్తే పుణ్య ఫలాలు దక్కుతాయని పురాణాలు చెప్తున్నాయి.

సృష్టికారకుడైన బ్రహ్మకు అత్యంత ప్రీతికరమైన ఈ జ్యేష్ఠమాసంలో ఆయన్ను పూజించడం వలన కష్టాలన్నీ తొలగుతాయని శాస్త్రాలు చెప్తున్నాయి. జ్యేష్ఠమాసం శుక్లపక్ష పాడ్యమి నుంచి దశమి వరకు పదిరోజులు నియమనిష్టలతో పూజించినట్లయితే దశవిధ పాపాలు తొలగుతాయని పురాణ వచనం. ఆనాడు బ్రహ్మీముహూర్త కాలంలో నిద్ర లేచి గంగానదిలో స్నానం చేసి గంగాదేవిని పూజించడం వలన పుణ్య ఫలాలు లభిస్తాయట. లేని పక్షంలో ఇంటిలోనే గంగను స్మరించుకొంటూ స్నానమాచరించినా అంతటి పుణ్యమే లభిస్తుందని చెప్తారు. ఎండలు అధికంగా వుండే ఈ మాసంలో వేడి నుంచి ఉపశమనం కల్గించే కడవ తదితర నీటి అవసరాలకు వినియోగించే వస్తువులను దానం ఇవ్వడం వలన పుణ్యం లభిస్తుందంటారు. మంచినీటిని అందించి ప్రజల దాహార్తి తీర్చినట్లయితే త్రిమూర్తుల అనుగ్రహం లభిస్తుంది. ఎన్నో వైశిష్ట్యాలకు నెలవైన ఈ మాసంలో చేసే వ్రతాలకు ఎంతో ప్రాధాన్యత వుంది. వీటిలో ప్రముఖమైనవి రంభావ్రతం, వటసావిత్రి వ్రతం. జ్యేష్ఠశుద్ధ తదియనాడు రంభా వ్రతాన్ని ఆచరించినట్లయితే శుభం కల్గుతుందని ముఖ్యంగా అవివాహిత స్త్రీలు ఈ వ్రతం చేయడం వలన చక్కని భర్త లభిస్తాడని చెప్తారు. జ్యేష్ఠ శుద్ధ పూర్ణిమనాడు చేసే మరొక వ్రతం వట సావిత్రి వ్రతం. వట వృక్షం అనగా మర్రి చెట్టు. మర్రిచెట్టును పూజించినట్లయితే సకల శుభాలు కల్గుతాయి. ఇంతటి శుభాలు, పుణ్యఫలాలను అందించే జ్యేష్ఠమాసంలో చేసే ప్రతి కార్యానికి ఎంతో విశిష్టత వుంది.

ట్రంకురోడ్డు కబుర్లు

నిస్తేజంలో తెలుగు తమ్ముళ్లు




నెల్లూరు పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో తెలుగు తమ్ముళ్లు కాస్త వెనుకబడ్డారు. పోటీచేద్దామా... వద్దా అనే మీమాంసలో ఆలస్యంగా రంగంలోకి దిగిన వంటేరు వేణుగోపాల్‌రెడ్డిని బాలారిష్టాలు వెంటపడ్డాయి. నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్, ఆత్మకూరు నియోజకవర్గాల్లో ఇన్‌ఛార్జీలు కుదురుకోకపోవడం, సోమిరెడ్డితో కలసి ఎక్కడకు ప్రచారానికి వెళ్లినా పెద్ద సంఖ్యలో కార్యకర్తలు రాకపోవడం వంటేరును బాధపెడుతున్నాయి. ఉదయగిరి నియోజకవర్గంలో పోటీ చేస్తున్న పార్టీ అభ్యర్థి బొల్లినేని రామారావు సైకిల్ దూసుకవెళ్తుంటే వంటేరు సైకిల్ ఇంకా రిపేర్లు చేసుకోవడంలోనే ఉన్నారంటూ వార్తలు వినవస్తున్నాయి.

రాజీవ్‌కన్నా గొప్పవాడా!



వైఎస్.రాజశేఖర్‌రెడ్డిపై ఆనం రామనారాయణరెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు చర్చనీయాంశమవుతున్నాయి. కలిగిరిలో పిసిసి అధ్యక్షుడు బొత్సా సత్యనారాయణతో కలసి ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ఆర్థికమంత్రి రాజీవ్‌గాంధీ పేరును బోఫోర్స్ ఎఫ్ఐఆర్‌లో చేర్చినప్పుడు ఎమ్మీగా రాజీనామా చేయని మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఇప్పుడు చేయడమేమిటి? జగన్ దగ్గర మేకపాటి సోదరులు తీసుకొన్న 800 కోట్ల అప్పు ఎగ్గొట్టనే ఈ నిర్ణయం తీసుకొన్నట్లు ఆయన చెప్పుకొచ్చారు. సభలో ఆయన పోలిక సంగతి అటుంచితే రాజశేఖర్ రెడ్డిని మంత్రి నిందించడం చర్చనీయాంశంగా మారింది.

వివేకా ఎంజాయ్...



రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డికి ఆనందరెడ్డని మరోపేరు వుంది. ఇటీవల జిల్లాలో పలు గ్రామాల్లో జరిగిన తిరునాళ్లు, ఉత్సవాలకు పాట కచ్చేరిల బృంద నృత్యంలో నర్తించను వెళ్లిన డ్యాన్సర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. కాని నగరంలో చిరంజీవి అభిమానుల నేతృత్వంలో జరిగిన పాటకచ్చేరిలో ఓ డ్యాన్సర్ బొడ్డుక్రిందుగా బట్టలు ధరించి పాటపాడుతూ నడుము ఊపుతుంటే తాను ఎమ్మెల్యేనన్న స్పృహలో కూడా లేకుండా వివేకానందరెడ్డి ముసిముసి నవ్వులు రువ్వుతూ గబ్బర్‌సింగ్‌లా ఎంజాయ్ చేశారు. సామాన్యులు ఇటువంటి డ్యాన్స్ చూస్తే పోలీసులు ఊరుకోరు. అదే వివేకానందరెడ్డి చూస్తూ ఎంజాయ్ చేస్తే మాత్రం టోపీలు తీసి చిందులు వేస్తారు. ఆ ప్రదర్శనను అడ్డుకొనే ప్రయత్నం చేయరు. ఇదేం న్యాయమండీ!

భన్వర్‌లాల్‌పై భగ భగ



రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి భన్వర్‌లాల్ పై నెల్లూరు ఓటర్లు మెటికలు విరుస్తున్నారు. దీనికి కారణం ఎన్నికల్లో ఓట్ల కోసం డబ్బు పంపిణీ చేసినవారు, డబ్బు తీసుకొన్నవారు ఐపిసి సెక్షన్ 171బి ప్రకారం నేరస్తులని ఆయన ప్రకటించడం. ఎన్నికల సమయంలోనే సామాన్య ఓటర్లను వివిధ పార్టీల తృతీయ స్థాయి నేతలైనా పలకరిస్తారు. ఎన్నికల ముందు ఓటుకు రమ్మని తృణమో పణమో అందిస్తారు. ఎన్నికల తర్వాత గెలిచిన నేతలను సామాన్యులు కలవగలిగే ఛాన్సే లేదు. ఇటువంటి పరిస్థితుల్లో ఓటుకు నోటు ఇచ్చేవారే కాకుండా పుచ్చుకొనే వారూ నేరస్తులని భన్వర్‌లాల్ ప్రకటించడంపై ట్రంకురోడ్డులో విస్తృత చర్చ జరుగుతుంది. ఆయన ఎంత మందిపై కేసు పెట్టిస్తారో చూద్దామనే తెలివైన ఓటర్లు ఉన్నారనుకోండి.

వార్తల్లో ఎస్-2



నగరంలో పేరు ప్రఖ్యాతులు గాంచిన ఎస్-2 థియేటర్ల సముదాయంలో అడ్వాన్స్ బుకింగ్ టిక్కెట్ల పేరిట బ్లాక్ టిక్కెట్ల దందా జరగడం నెల్లూరీయులను బాధపెడుతోంది. ఇటీవల విడుదలైన దమ్ము, గబ్బర్‌సింగ్ సినిమాల మొదటి రోజు టిక్కెట్లను బుకింగ్‌లో ఇవ్వలేదు. ఎస్-2 థియేటర్ల ఆన్‌లైన్ బుకింగ్‌లో బుక్ చేసుకొనే అవకాశం లేకుండా చేశారు. ఈ కాంప్లెక్స్‌లోని మూడు హాళ్లలో తొలిరోజు 18షోలు వేశారు. ఈ థియేటర్లలో ఒక 'షో'ను 1500 మంది ప్రేక్షకులు చూడొచ్చు. మొత్తం షోల 27వేల టిక్కెట్లు హాంఫట్ వెనుక మేనేజర్ ఆదిత్యబాబు పేరు ఊరంతా కోడైకూస్తోంది. ఉపఎన్నికల ప్రచారంలో పడిన మేనేజ్‌మెంట్‌కు ఇది వినబడినట్లు లేదు.

గబ్బర్‌సింగ్ పరవాలేదు!



✍ అల్లూరు రహీం

హీరో పవన్ కళ్యాణ్ అభిమానులు ఖుషీగా జల్సా చేసుకొని ఏళ్లు గడిచాయి. విజయానందంతో వాళ్లు తీన్‌మార్ అని చాలా కాలమైంది. పవన్ కళ్యాణ్‌లో అభిమానులు ఆశించే జోష్, సంభాషణల్లో వేగం, చూపుల్లో చురుకుదనం, నృత్యాల్లో కొత్తదనం ఇవన్నీ ఈ ఐదారేళ్లుగా లేవు. అసలు ఎలాంటి అంశాలు మేళవిస్తే అది పవన్ కళ్యాణ్ సినిమా అవుతుంది? ఈ విషయం దర్శకుల కంటే ఆయన అభిమానులకే బాగా తెలుసు. అందుకే పవన్ కళ్యాణ్ వీరాభిమాని హరీష్ శంకర్ దర్శకుడైపోయాడు. తన అభిమాన కథానాయకుడు పవన్ కళ్యాణ్‌ను గబ్బర్‌సింగ్‌గా తీర్చిదిద్దాడు. హిందీలో విజయవంతమైన 'దబాంగ్' చిత్రానికి గబ్బర్ సింగ్ రీమేక్ అయినా హరీష్ శంకర్ కథలో తెలుగుదనానికి అనుగుణంగా కొన్ని మార్పు చేర్పులు చేశాడు. ఈ సినిమాలో పవన్ కళ్యాణ్‌ను వన్ మ్యాన్ షోగా తీర్చిదిద్దినా నవరసాలు సమపాళ్లలో అద్దడం మూలంగా బోర్ లేకుండా చూసేయవచ్చు. ఈ చిత్రంలో పవన్ కళ్యాణ్ స్టైలింగ్ మారింది. గబ్బర్ సింగ్, ఆకాశం అమ్మాయి అయితే, గన్నులాంటి కన్నులున్న పిల్లా, దిల్‌సే, కెవ్వుకేక చరణాలతో సాగే పాటల్లో మాస్ స్టెప్పులు వేశాడు. దేవిశ్రీప్రసాద్ సంగీతం పాటలు జనరంజకమవను ఎంతగానో తోడ్పడింది. సినిమాలో దర్శకుడే వ్రాసిన డైలాగులు బాగా పేలాయి. హీరో తనను ఉద్దేశించి నేను హీరోను కాను విలన్‌ను, నాకు కొంచెం తిక్కుంది... కాని దానికో లెక్కుంది, నాకు నేనే పోటీ... చరిత్ర చెత్త బుట్ట, నేను ఆకాశం లాంటి వాడ్ని, నాకు పైత్యం, నమ్మకముంటే ధైర్యముంటుంది, పవర్ అనేది పదవిలో వుండదు... మనిషిలో వుంటుంది అనే డైలాగులు హీరోయిజం చాటుకోను చెప్పినవే. సినిమాలో కామెడీ మిస్ కాకూడదని పెట్టిన కబడ్డీ ఫైట్, రౌడీల అంత్యాక్షరి, పేకాట రాయుళ్ల పరుగు, బ్యాంక్ రికవరీ ఆఫీసర్‌గా బ్రహ్మానందం, కానిస్టేబుల్‌గా ఆలీ ప్రేక్షకులను నవ్విస్తారు. సినిమాలో కొన్ని లోపాలున్నాయి. హీరో కొండవీడు స్టేషన్‌కు సిఐ. కాని ఆ స్టేషన్‌లో ఎస్ఐ కనపడడు. సిఐ అంటే తప్పనిసరిగా ఖాకీ డ్రస్ వేయాలి. టోపీకి బదులు తలకు కాశీ టవల్ చుట్టుకోవడం, బటన్లు విప్పి బనియన్‌తో దర్శనమివ్వడం తిక్కవున్న పోలీసుకు మినహా మామూలు పోలీసులకు సాధ్యం కాదేమో? ఐటమ్ పాట 'కెవ్వు కేక'లో పాట రచయిత మస్తుగా బూతు దట్టించేశాడు. 1980 మాదిరి సినిమా జరిగే కథకు దర్శకుడు అద్దిన మాస్ మసాల వల్ల చిత్రంలో లోపాలు ప్రేక్షకులు పెద్దగా గమనించరు. దబాంగ్ సినిమా కథను చివరలో దర్శకుడు మార్చివేశాడు. శ్రీకాకుళం యాసలో మాట్లాడిన పవన్ కళ్యాణ్ మాటలు కొన్నిసార్లు అర్థం కావు. అయినా చాలారోజులకు పవన్ కళ్యాణ్ అభిమానులకు షడ్రసోపేత విందు గబ్బర్‌సింగ్.

చిత్రకథలోకి వెళ్తే వెంకటరత్నం నాయుడు అలియాస్ గబ్బర్‌సింగ్ (పవన్ కళ్యాణ్)కు షోలే చిత్రంలోని గబ్బర్‌సింగ్ పాత్ర అంటే ప్రాణం. ఎన్నోసార్లు ఈ చిత్రం చూసిన ఆయన తన పేరు గబ్బర్‌సింగ్‌గా మార్చుకొంటాడు. తన తండ్రి చనిపోవడంతో తల్లి (సుహాసిని) నాయుడు(నాగినీడు)ను రెండవ వివాహం చేసుకొంటుంది. నాయుడు కొడుకు(అజయ్) పట్ల ద్వేషంతో గబ్బర్ సింగ్ ఇంటి నుంచి వెళ్లిపోయి పాతికేళ్ల తర్వాత కొండవీడు స్టేషన్‌కు సిఐగా వస్తాడు. గ్రామంలో అరాచక శక్తి సిద్ధప్ప(అభిమన్యు సింగ్)ను అదుపు చేసే పనిలో భాగంగా అతనికి శత్రువు అవుతాడు. బజారులో బొమ్మలు తయారుచేసి అమ్మే అమ్మాయి భాగ్యలక్ష్మి(శృతిహాసన్) అతని మనసు దోస్తుంది. మంత్రి ప్రదీప్‌కుమార్(రావు రమేష్)ను సిద్ధప్ప ఎమ్మెల్యే టిక్కెట్ కోరుతాడు. నీలాంటి రౌడీషీటర్లకు టిక్కెట్ ఏమిటని ప్రశ్నించగా రెచ్చిపోతాడు. మరో మంత్రి సహాయంతో హైకమాండ్‌కు ఐదు కోట్లు లంచం పంపించబోగా గబ్బర్‌సింగ్ ఆ డబ్బును సీజ్ చేస్తాడు. జులాయిగా తిరిగే గబ్బర్‌సింగ్ తమ్ముడు అజయ్‌ను చేరదీసే సిద్ధప్ప మంత్రి ప్రదీప్‌కుమార్‌ను స్వీట్‌బాక్స్‌లో బాంబు పెట్టించి చంపుతాడు. తన తమ్ముడు దోషికాదని నిరూపించడంతోపాటు సిద్ధప్పను చావ చితక కొట్టడంతో గబ్బర్‌సింగ్ సినిమా ముగుస్తుంది. ఈ సినిమాతో హీరోయిన్ శృతిహాసన్ కుదుటపడినట్లే. హీరో పవన్ కళ్యాణ్‌తో అభిమన్యుసింగ్, తనికెళ్ల భరణి కూడా నటనలో పోటీ పడ్డారు. పవన్ కళ్యాణ్ అభిమానులు గబ్బర్‌సింగ్‌ను మెచ్చుతారు.

చిత్ర సమీక్ష



ఆమె జస్ట్... ఫ్రెండ్ మాత్రమే!

హిందీ చిత్రం 'దమ్ మారో దమ్' తెలుగులో హీరో రానా, బ్లాక్ బ్యూటీ బిపాసబసు కలసి నటించారు. అప్పటినుంచి వీరిద్దరూ కలసి తిరుగుతున్నారని బాలీవుడ్‌లో ఒకటే కథనాలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై రానాను ప్రశ్నిస్తే మా ఇద్దరి మధ్య ప్రత్యేక బంధమేది లేదు. బిపాసా జస్ట్... ఫ్రెండ్ మాత్రమే. డేటింగ్, లవ్ అంటూ రకరకాలుగా వస్తున్న పుకార్లు నిజం కాదు. ఈ మధ్య నాకు ప్రమాదం జరిగితే తను ఫోన్ చేసింది. అదీ... ఓ స్నేహితురాలిగా మాత్రమే. వాటికి చిలవలుపలువలు అల్లడం అనవసరం అన్నారు. తనకో గాళ్‌ఫ్రెండ్ వుందనీ, ఆమెది హైదరాబాద్ అని రానా బాంబు పేల్చాడు.

చరణ్‌కు సల్మాన్ బిర్యానీ



మెగాస్టార్ పుత్రుడు రామ్‌చరణ్‌కు బాలీవుడ్‌లో స్నేహితులు ఆత్మీయులు పెరుగుతున్నారు. ఆయన తొలి హిందీ చిత్రం 'జంజీర్' ప్రస్తుతం సెట్స్ మీద వుంది. చరణ్‌కు హిందీ సినీ జనాల నుంచి అభిమాన పూర్వకమైన స్వాగతం లభిస్తుంది. అమితాబ్‌బచ్చన్, కరణ్ జోహార్ లాంటి ప్రముఖులు చరణ్‌ను ప్రోత్సహిస్తున్నారు. ఇప్పుడీ జాబితాలో సల్మాన్‌ఖాన్ కూడా చేరారు. ఆయన చరణ్‌తో స్నేహ పూర్వకంగా మాట్లాడంతోపాటు చరణ్‌ను తన ఇంటికి ఆహ్వానించి విందు ఇచ్చారు. అప్పుడప్పుడు 'జంజీర్' సెట్‌కు తన ఇంటి నుంచి బిర్యానీ పంపిస్తూ చరణ్‌కు బాగా దగ్గరవ్వడం చర్చనీయాంశమయ్యింది.

వంశీ కొత్తచిత్రం

కథను తెరపైకి తీసుకరావడంలో తనకంటూ ప్రత్యేకశైలి వున్న దర్శకుడు వంశీ. ఈయన రచయితగా కూడ తెలుగు వాళ్లకు చిరపరిచితుడు. ఆయన వ్రాసిన 'వంతెన' అనే కథను ఇప్పుడు తెరపైకి తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాడు. ఈ చిత్రానికి 'ముసలోడిరేవు'గా పేరు పెట్టారు. గోదావరి జిల్లాలలో చిత్రీకరణ జరిగే ఈ చిత్రంలో హీరోయిన్‌గా షాపింగ్‌మాల్ ఫేం అంజలిని ఎంపిక చేసినట్లు తెలిసింది.



త్రిష హ్యాపీ!

త్రిష హీరోయిన్‌గా పరిశ్రమకు పరిచయమై పదేళ్లయ్యింది. ఈ విషయమై ఆమె మాట్లాడుతూ ఓసారి వెనక్కి తిరిగి చూసుకొంటే నేను చాలా దూరం వచ్చేశానని అనిపిస్తుంది. 'లేసాలేసా' అనే తమిళ చిత్రంలో కథానాయికగా ప్రేక్షకుల ముందు కొచ్చాను. ఏ సినిమాలోనైన నాపాత్రను తపనతో పోషిస్తాను. సత్ఫలితాన్నే ఆశిస్తాను. అన్నిసార్లు విజయం దక్కకపోవచ్చు. అయినా నేను నావరకు హ్యాపిగా వుండేందుకే ఇష్టపడతాను. ఈసారి జన్మదిన వేడుకలను చేసుకోను స్నేహితులతో కలసి యూరప్ ట్రిప్ వెళ్తున్నాను. తిరిగొచ్చాక తెలుగు చిత్రం 'సారొస్తారు' షూటింగ్‌కు హాజరవుతానంది.

కల నెరవేరింది!

రామ్‌గోపాల్‌వర్మ దృష్టిలోపడితే చాలనుకొన్న చిన్న నటి మధుశాలినికి తన చిత్రంలో ఏకంగా బిగ్‌బీ అమితాబ్‌తో కలసి నటించే అవకాశమిచ్చాడు. ఈ ప్రోత్సాహానికి మధుశాలిని ఉక్కిరిబిక్కిరవుతోంది. వర్మ తీస్తున్న డిపార్ట్‌మెంట్ చిత్రంలో మధుశాలిని లేడీ గ్యాంగ్‌స్టర్‌గా నటిస్తుంది. ఈ సినిమాలో ఈమెపై ఓపాట చిత్రీకరించారు. దీని కోసం కోటిరూపాయల సెట్టింగ్ వేయించారట. ఈ విషయమై మధుశాలిని మాట్లాడుతూ నా జీవితాన్ని మలుపుతిప్పే గొప్ప సినిమా ఇది. వర్మగారి సహకారంతో బాలీవుడ్‌లో నటించే అవకాశం సాధించాను. ఇక్కడ మరిన్ని మంచిపాత్రలు చేస్తానన్న నమ్మకం వుంది. అవకాశం వస్తే భాషతో సంబంధం లేకుండా ఎక్కడైనా నటిస్తానంటుందీ ఈభామ.



సణుగుడు

* వ్యవస్థ పతనానికి కారణం ఓటరు కాదు.

డోలేంద్ర

స్వాతంత్ర్యం రాగానే మన పరిపాలనా వ్యవస్థగా పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ఎంచుకొంటామని చెప్తే, బ్రిటీష్ దొరలు పగలబడి నవ్వారు. వారికి భారతీయులంటే ఎక్కడ లేని ఎగతాళి. చదువు సంధ్యలు లేని నిరక్షరకుక్షులు, ఆకలి కేకలతో నిత్య సావాసం చేసే కటిక దరిద్రులు, భూస్వాముల పెత్తందారీతనంలో మ్రగ్గే బానిసలు, మత మౌఢ్యం మూర్తీభవించిన అనాగరికులు అధికంగా వున్న దేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అసాధ్యమని గద్దించారు బ్రిటీష్ పాలకులు. భిన్న మతాలు, భాషలు, సంస్కృతులు, ఆచార సాంప్రదాయాలు, 450 రాచరిక సంస్థానాలు, లెక్కలేనంత మంది జమీందారులు, పాలెగాళ్లు, భూస్వాములతో చీలికలు పేలికలుగా వున్న దేశాన్ని ప్రజలెన్నుకొనే ప్రభుత్వంతో ఏకత్రాటి మీద నడపడం ఎట్లా సాధ్యం అని కూడా ప్రశ్నించారు. కానీ జవహర్‌లాల్ నెహ్రూ, బిఆర్.అంబేద్కర్, రాజాజీ, ఎన్‌జి.రంగా, మౌలానా, బాబూ రాజేంద్ర ప్రసాద్, సర్వేపల్లి రాధాకృష్ణన్, సర్దార్ వల్లభాయి పటేల్, కృష్ణ మీనన్, అల్లాడి కృష్ణస్వామి అయ్యర్, మోటూరు సత్యనారాయణ, అనంతశయనం అయ్యంగార్, భోగరాజు పట్టాభి సీతారామయ్య, జగజ్జీవన్ రామ్ వంటి మహోద్దండ రాజకీయ పండితులు వారి వెటకారాలను పట్టించుకోలేదు. మూడు వేల ఏళ్ల నాడు ఆర్య చాణుక్యుడు ఏర్పరచిన గణతంత్ర రాజ్య వ్యవస్థ నుంచి, ఆధునిక కాలపు అమెరికన్, ఐరోపా దేశాల ప్రజాస్వామ్య పద్ధతుల వరకు నిశితంగా శోధించి ప్రస్తుత పార్లమెంట్‌కు ప్రాణ ప్రతిష్ట చేశారు. భారత ప్రజల విజ్ఞత, వివేకాల మీద వారికి అపార నమ్మకం. అరవై ఏళ్ల తర్వాత వెనక్కి తిరిగి చూసుకొంటే ఆ నమ్మకం ఒమ్ము కాలేదని తేటతెల్లమౌతున్నది.

ఇప్పటికి 14సార్లు లోక్‌సభకు ఎన్నికలు జరిగాయి. ఒకసారి కూడా ప్రజలు తప్పు చేశారన్న భావం ఎక్కడా వ్యక్తం కాలేదు. స్వాతంత్రోద్యమ సువాసనలు దాదాపు ఐదు ఎన్నికల వరకు కొనసాగాయి. అందువల్ల ప్రతి ఎన్నికలోనూ కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. కానీ అత్యవసర పరిస్థితి తర్వాత 1977లో జరిగిన ఎన్నికలలో ప్రజాస్వామ్యంలో పాటించవలసిన రాజకీయ విజ్ఞత అంటే ఏమిటో ప్రదర్శించి చూపారు భారతీయ ఓటర్లు. 1972లో జరిగిన బంగ్లాదేశ్ ఆవిర్భావం ఇందిర మ్మను అపర దుర్గ అవతారంగా భావింపచేసింది. కానీ ఆరేళ్లు తిరిగేసరికి అదే ఇందిరమ్మను ప్రజాస్వామ్య హంతకిగా ఛీకొట్టారు. రెండేళ్లలోపలే జనతా పార్టీ ప్రయోగం పరిపాలనకు సరితూగదని నిర్ధారించుకొని ఇందిరమ్మను మళ్లీ గద్దె ఎక్కించారు. 1989లో రాజీవ్‌గాంధీకి బ్రహ్మరథం పట్టి, 426 స్థానాలలో గెలిపించారు. 21 శతాబ్దంలోకి తీసుకవెళ్తానని ఆయన చేసిన వాగ్దానం జనాన్ని ఆకర్షింప జేసింది. కానీ అది ఉత్తుత్తి వాగ్దానమని తేలగానే, రాజీవ్‌గాంధీ చనిపోయాడన్న సానుభూతి కూడా లేకుండా తొమ్మిదో లోక్‌సభలో కాంగ్రెస్ బలాన్ని సగంకంటే క్రిందకు (195 స్థానాలు) దించేశారు అదే జనం. బిజెపిని గద్దె ఎక్కించడంలో కానీ, ఆ తర్వాత వారిని మట్టి కరిపించడంలో కానీ భారతీయ ఓటరు చూపిన రాజకీయ విజ్ఞత అసాధారణమైనది. ఏ సమయానికి ఏది సరైన రాజకీయ నిర్ణయమో దాన్నే పాటించి చూపారు ఓటర్లు. అమెరికా, ఇంగ్లాండ్, ఇటలీ, ఫ్రాన్స్ వంటి అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే భారతీయ ఓటరులోని ప్రజాస్వామ్య స్ఫూర్తి ఎంతో గొప్పదని చరిత్రలో పలు మార్లు రుజువైంది. చదువు కంటే, పేదరికం కంటే, మతం కంటే దేశ భక్తి మిన్న అని నిరూపించారు భారతీయ ఓటర్లు.

దురదృష్టవశాత్తు మన రాజకీయవాదులు, రాజకీయ పార్టీలు మాత్రం ఆనాడు బ్రిటీష్ దొరలు చెప్పిన జోస్యాన్ని నిజం చేస్తున్నాయి. ప్రజాస్వామ్యాన్ని కాపాడడానికి సాధారణ ప్రజలు కఠినమైన పరీక్షలలో నెగ్గుకొంటూ వస్తున్నారు. రాజకీయపార్టీలు మాత్రం ప్రజాస్వామ్యం గొంతు కోయడానికి తమ శక్తియుక్తులన్నీ ధారపోస్తున్నాయి. ఎన్నికల వ్యవస్థ కల్మషానికంతటికీ సగటు ఓటరును నిందించడం మేధావులకు ఒక ఫ్యాషన్‌గా మారింది. ఓటుకు నోటు తీసుకొనే హీన సంస్కృతి తొలగే వరకు భారత దేశంలో ప్రజాస్వామ్యం బ్రతికి బట్టకట్టడం అసాధ్యమని ప్రకటించాడు లోక్‌సత్తా నేత జయప్రకాష్ నారాయణ. ఇంగ్లీషు పత్రికలలో వచ్చే వ్యాసాలు, ఎన్డీటీవి వంటి ఛానళ్లలో ప్రసారమయ్యే చర్చలు కూడా ఇదే తీరులో వుంటున్నాయి. కానీ వారిది పూర్తిగా తప్పుడు అభిప్రాయం. నోరులేనివాడని సగటు మనిషిని నిందించడం తప్ప నిజాలు తెలుసుకొని చేస్తున్న వాదన కాదది.

ఓటరు డబ్బు తీసుకొంటున్న మాట నిజం. కానీ డబ్బు తీసుకొని ఓటు వేస్తున్నాడనడం మాత్రం నిజం కాదు. అభ్యర్థులు ఇచ్చే డబ్బుకు, వేసే ఓటుకు సంబంధమే లేకుండా వ్యవహరించడం సాధారణ ఓటరు తెలివికి నిదర్శనం. నెల్లూరు జిల్లా వరకు తీసుకొన్నా అందుకు ఎన్నో ఉదాహరణలున్నాయి. మొన్నటికి మొన్న కోవూరు శాసనసభ ఉప ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఓటుకు వెయ్యి నోటు ఇచ్చింది. తెలుగు దేశం ఐదు వందలిచ్చింది. జగన్ ఇచ్చింది కేవలం 200 రూపాయలు. కానీ ఓటు లెక్కకొచ్చే సరికి జగన్ ముందు, కాంగ్రెస్ చివర. 2004 శాసన సభ ఎన్నికలలో ఆత్మకూరు నియోజకవర్గంలో బొల్లినేని కృష్ణయ్య ఓటుకు వెయ్యి నోటు ఇచ్చాడు. అంతకు క్రితం ఎమ్మెల్యేగా ఆయన నియోజక వర్గానికి ఎంతో సేవ చేశాడు. తన స్వంత డబ్బు పెట్టి, యంత్రాలు వాడి కాలువలు, చెరువులు బాగు చేయించాడు. ఎంతో మందికి ఉద్యోగాలిచ్చాడు.

కొరవ 14వ పేజీలో

సుబ్బరామిరెడ్డికి మెగాస్టార్ అభిమానుల మద్దతు!



నెల్లూరు సిపిఆర్ కళ్యాణమండపంలో జరిగిన చిరంజీవి అభిమానుల సదస్సులో మాట్లాడుతున్న టిఎస్ఆర్.

● విజయవంతమైన అభిమానుల సదస్సు

కాంగ్రెస్ పార్లమెంటు అభ్యర్థి టి.సుబ్బరామిరెడ్డి విజయానికి చిరంజీవి అభిమానులంతా కలసికట్టుగా కృషిచేస్తామని చిరంజీవి యువత పేర్కొంది. టిఎస్ఆర్‌తో యువత పరిచయం కార్యక్రమం పేరిట మే 14వ సిపిఆర్ కళ్యాణ మండపంలో తేది ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసింది. చిరంజీవి ఫ్యాన్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న టి.సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ చిరంజీవికి, తనకు గల అనుబంధాన్ని నెమరు వేసుకొన్నారు. గత 20ఏళ్లుగా తమ మధ్య స్నేహం ఉందన్నారు. ఆయనతో తాను తీసిన స్టేట్‌రౌడీ ఎంతో విజయవంతం అయిందని గుర్తు చేశారు. చిరంజీవిని హిందీ సినీ రంగానికి పరిచయం చేసే అవకాశం లభించడం సంతోషంగా ఉందన్నారు. రాజ్యసభ సభ్యత్వం మరో రెండేళ్లు ఉన్నా ఏఐసిసి అధినేత్రి సోనియాగాంధీ ఆదేశాలకనుగుణంగా నెల్లూరు నుంచి పోటీచేస్తున్నట్లు తెలిపారు. ఆధ్యాత్మికత, సేవాభావం ఉన్న నెల్లూరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. తనను గెలిపించడం ద్వారా చిరంజీవికి ఒక మంచి బహుమతి ఇవ్వాలని అభిమానులను కోరారు. భూకబ్జాలకు, నేరస్తులతో సంబంధం ఉన్న వ్యక్తులకు ఈ ఎన్నికలలో తగిన గుణపాఠం చెప్పాలని ఆర్థిక మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పరోక్షంగా జగన్‌పై విమర్శలు చేశారు. చిరంజీవి పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేయడం గొప్ప పరిణామన్నారు. నగర, రూరల్ శాసనసభ్యులు శ్రీధర్‌కృష్ణారెడ్డి, వివేకానందరెడ్డిలు మాట్లాడుతూ టిఎస్ఆర్ సేవాగుణాన్ని కొనియాడారు. అలాంటి వ్యక్తిని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. చిరంజీవి అభిమాన సంఘం నేతలు చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో చిరంజీవి యువత జిల్లా అధ్యక్షునిగా సరయు మోటార్స్ నిర్వాహకుడు రాజ్‌కుమార్‌ను ఎన్నుకొన్న ఈ కార్యక్రమానికి చిరంజీవి, పవన్‌కళ్యాణ్, రామ్‌చరణ్‌తేజ, అల్లు అర్జున్ అభిమానులు తరలి రావడంతో కళ్యాణ మండపం క్రిక్కిరిసి పోయింది.



కొత్త వాహనాలు రోడ్డుపైకి వచ్చేదెన్నటికి?

చెత్త తొలగింపుకు బ్రేక్!

విజిల్ లేదు - వాహనాలు రావు

ఇళ్లలోని చెత్తను తొలగించేందుకు, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచేందుకు ప్రవేశపెట్టిన పథకం అటకెక్కింది. చెత్తంతా రోడ్లపై పారవేస్తుండడంతో పారిశుద్ధ్యం క్షీణిస్తున్నదని, దీనిని నివారించేందుకు అధికారులు మినీ చెత్తవాహనాలు పెట్టి విజిల్ వేస్తే ఆయా ప్రాంతాల్లోని వారు చెత్త తీసుకవచ్చి వేసేలా చేశారు. మొదట్లో కొంత కాలం ఇది బాగానే ఉన్నా తర్వాత ఇది అటకెక్కింది. విజిల్ ఎక్కడా విన్పించడం లేదు. వాహనాలు ఎక్కడా కన్పించడం లేదు. దీనికి కారణం ఇళ్ల వద్ద నుంచి చెత్తను సేకరించే వాహనాలు మరమ్మత్తులకు గురికావడం, చిన్న చిన్న మరమ్మత్తులకు గురైన వాహనాల గురించి పట్టించుకోక పోవడంతో పరిస్థితి మొదటికొచ్చింది. ఆరు లక్షల జనాభా గల నగరంలో రోజుకు 250 టన్నుల చెత్త వస్తుంది. దీనిని తొలగించేందుకు వెయ్యి మందికి పైగా సిబ్బంది ఉన్నారు. ఏడాదికి కోట్ల రూపాయలు పారిశుద్ధ్యం మెరుగుకు ఖర్చు పెడుతున్నారు. చెత్త తొలగించేందుకు 12వ ఆర్థిక సంఘం నిధులతో కొత్తగా పలు వాహనాలను కొనుగోలు చేశారు. వీటితోపాటు ఇళ్ల నుంచి చెత్త సేకరణకు ప్రత్యేకంగా కొన్ని వాహనాలను కొన్నారు. రోడ్లపై చెత్త వేయకుండా నివారించడం వీటి ఉద్దేశం. పారిశుద్ధ్యాన్ని పూర్తిస్థాయిలో మెరుగుపరచేందుకు కార్పొరేషన్ ఈ పద్ధతికి శ్రీకారం చుట్టినప్పటికీ మరమ్మత్తులకు గురైన వాహనాల గురించి పట్టించుకోకపోవడంతో అధికారుల పుణ్యమా అని ఇది కాస్త ఆరంభశూరత్వమే అయ్యింది.



జైన్‌గోల్డ్ షోరూంలో వారం వారం నిర్వహిస్తున్న ఐదవ లక్కీ డ్రాలో విజేతలను ప్రకటిస్తున్న మాజీ కార్పొరేటర్ పుట్టా రామకృష్ణారెడ్డి. ప్రక్కన షోరూం నిర్వాహకులు మణిలాల్ జైన్, రాజేష్ జైన్, పారస్‌మల్ జైన్.

సణుగుడు

13వ పేజీ కొరవ

నిజాయితీగా పని చేశాడు. కానీ పూటకు ఠికానా లేని కొమ్మి లక్ష్మయ్య నాయుడుకు జనం బ్రహ్మరథం పట్టారు. కృష్ణయ్య ఇచ్చిన వెయ్యి నోటులో కొంత భాగాన్ని లక్ష్మయ్యకు చందాగా ఇచ్చి మరీ ఓట్లు వేశారు జనం. అభ్యర్థులను డబ్బివ్వమని ఏ ఓటరూ కోరడం లేదు. ఇచ్చాడని మొగ్గు చూపడం లేదు. ఇవ్వలేదని ఓటు వేయడం మానడం లేదు. డబ్బుకు, ఓటుకు ఏ మాత్రం సంబంధం లేకుండా వ్యవహరించడం ద్వారా సగటు ఓటరు తానెంత తెలివిగల్గిన వాడినో పదే పదే రుజువు చేస్తూనే వున్నాడు. ఆ అనుభవాల నుంచి గుణపాఠాలు నేర్చుకోలేక పోవడం రాజకీయ పార్టీల తెలివి తక్కువ మాత్రమే.

అసలు ఎన్నికలలో ధన ప్రభావం ఎందుకు వచ్చింది? ఎవరు తెచ్చి పెట్టారు ఆ శనిని? ఖచ్చితంగా ఆ నేరం రాజకీయ పార్టీలదే తప్ప ఓటర్లది కాదు. డబ్బు అర్హతతో అభ్యర్థులను ఎంపిక చేయడం వల్లనే ఈ దరిద్రం దాపురించిందన్న నిజాన్ని ఎవరూ కాదనలేరు. 1990 వరకు కూడా ఎమ్మెల్యే, ఎమ్పీ అభ్యర్థుల విషయంలో కుటుంబ నేపథ్యం, ప్రజలలో పలుకుబడి వంటి అంశాల ఆధారంగా అభ్యర్థులను నిర్ణయించే సాంప్రదాయం వుండేది. కాంట్రాక్టర్లు, పారిశ్రామికవేత్తలు, సినీ రంగ ప్రముఖులు, మద్యం అమ్మేవారు, భూకబ్జాలతో పైకి వచ్చిన రియల్ ఎస్టేట్ వ్యాపారుల వంటి వారిని కాంగ్రెస్, టిడిపిలు రెండూ కూడా రంగంలోదించడం మొదలు పెట్టాయి. ఆ కోవకు చెందిన అభ్యర్థులకు కరెన్సీ నోటు విజిటింగ్ కార్డు. కేవలం తమకున్న ధన సంపత్తిని ప్రదర్శించి ప్రజల ముందుకు వెళ్లాలి. దానితో డబ్బు అవసరం పెరిగింది. అది కాస్తా డబ్బు లేకుంటే అభ్యర్థిగా పనికిరారన్న స్థాయికి చేరుకొన్నది. ఎంతో కష్టపడి ఇందిరమ్మ, కమ్యూనిస్టు పార్టీలు కలిసి భూస్వామిక వ్యవస్థను నిర్మూలిస్తే చంద్రబాబు నాయుడు, వైఎస్.రాజశేఖర్ రెడ్డి కలిసి దాని స్థానంలో, అంతకంటే ప్రమాదకరమైన ధనస్వామిక వ్యవస్థను స్థిరపరచారు.

2009 ఎన్నికలలో గెలిచిన లోక్‌సభ అభ్యర్థులలో ముప్పాతిక భాగం ఈ కోవకు చెందిన ధన స్వాములే. మేకపాటి రాజమోహన్‌రెడ్డి, మాగుంట శ్రీనివాసులురెడ్డి, రాయపాటి సాంబశివరావు, లగడపాటి రాజగోపాల్, కావూరి సాంబశివరావు, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మోదుగుల వేణుగోపాలరెడ్డి, గుత్తా సుఖేంద్రరెడ్డి, నామా నాగేశ్వరరావు, వైఎస్.జగన్మోహన్‌రెడ్డి, ఎస్పీవై రెడ్డి, జి.వివేకానంద, కనుమూరి బాపిరాజు, అనంత వెంకట రామరెడ్డి... జాబితాలో పేర్లన్నీ ఇవే. వీరందరి అర్హత – కేవలం డబ్బు మాత్రమే. కెసిఆర్, పురంధరేశ్వరి, ఒవైసీ, చింతా మోహన్ వంటి రాజకీయ నేపథ్యం కల్గినవారు చాలా తక్కువ. రెండు పార్టీలూ ఒకే అర్హతను పాటిస్తుండడంతో ఎన్నికలంటే డబ్బు మాత్రమే అనే దురభిప్రాయం ప్రబలి పోతున్నదే తప్ప, ఓటర్లు నోట్లు అడిగినందువల్ల కాదు.

జవహర్‌లాల్ నెహ్రూ, అంబేద్కర్ కోరుకొన్న పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి, ప్రస్తుత రాజకీయ పార్టీలు ఎంపిక చేస్తున్న ప్రజాప్రతినిధుల తీరుకు పొంతనే కుదరడం లేదు. ఆనాటి స్ఫూర్తిని నిట్ట నిలువునా నరికి పాతర పెడుతున్నాయి ఇప్పటి రాజకీయ పార్టీలు. లోక్‌సభలో 175 మందికి నేర చరిత్ర వుంది. ముప్పాతిక భాగం కోటీశ్వరులు. ప్రభుత్వ ఖజానాకు వ్యాపారాలు, కాంట్రాక్టులు, భూకేటాయింపుల ద్వారా కన్నం పెట్టి, ఆ డబ్బే అర్హతగా ప్రజాప్రాతినిధ్య సభకు ఎన్నికౌతున్న వారితో లోక్‌సభ నిండి పోతున్నది. అందువల్లనే ఆ అత్యున్నత సభలో రైతుల గురించి కానీ, కార్మికుల గురించి కానీ, సమాజంలో అట్టడుగున పడి వున్న బడుగు జీవుల గురించి కానీ ప్రస్తావించే వారే కరవై పోతున్నారు. ఈ నేరం పార్టీలదే తప్ప ప్రజలది కాదు. అన్ని పార్టీలూ ఎన్నికలలో ధనికులను, గూండాలను, నేరస్తులను నిలబెడుతున్నప్పుడు సచ్ఛీలులను ఎంపిక చేసుకొనే అవకాశం ఓటరుకు ఎక్కడుంది?

జైలుకు వెళ్తేనే

మొదటి పేజీ కొరవ

దొరకలేదు. అందువల్ల కొత్తగా ఖాతాలు తెరిచి, నిర్వహణ ఖర్చులను వాటి ద్వారా జరిపిస్తున్నారు. సిబిఐ ఇంకెన్ని కేసులు పెట్టినా సరే, సాక్షి పత్రికను కానీ, టీవీ ఛానల్‌ను కానీ నిలిపివేసే ప్రశ్న లేదని జగన్ తన సిబ్బంది ముందు ప్రకటించాడు. అవసరమైతే తనకున్న ఆస్తులు అమ్మి అయినా పత్రికను నడుపుతానని ప్రకటించారాయన. మరొక ప్రక్క సాక్షి నిర్వహణ ఖర్చులకు చందాలిస్తామని రాష్ట్ర మంతటి నుంచి జగన్ అభిమానులు ముందుకు వస్తున్నారు. జగన్ సామాజిక వర్గానికి చెందిన ప్రముఖులు, వ్యాపారులు, సంపన్నులు ఈ విషయంలో బాగా చొరవ చూపుతున్నారు.

రేపు 28వ తేది కోర్టుకు హాజరైన సమయంలో కోర్టు అనుమతితో జగన్‌ను అరెస్ట్ చేసే అవకాశం ఉందని వినికిడి. ఆ లోగా జగన్‌కు అత్యంత ఆప్తుడు, ఆంతరంగిక సలహాదారు అయిన సజ్జల దివాకర్‌రెడ్డిని అరెస్ట్ చేస్తారని తెలుస్తున్నది. దివాకర్‌రెడ్డి ద్వారా ఓబులాపురం ఇనుప ఖనిజం సొత్తు కొన్ని వందల కోట్లు జగన్‌కు చేరిందన్న సంగతి తెలిసిందే. ఈ పరిణామాలు జగన్ తల్లి విజయలక్ష్మికి కలవరం కల్గిస్తున్నాయని చెప్తున్నారు. గత వారం రోజులుగా ఆమె బైబిల్ పఠనంలో నిమగ్నమై ఉన్నారట. ఎవరితోనూ మాట్లాడడానికి ఇష్టపడడం లేదట. జైలుకు వెళ్లే పరిస్థితి లేకుండా సిబిఐతో సర్దుబాటు చేసుకొమ్మని ఆమె సలహా ఇచ్చారని, దానికి జగన్ ఒప్పుకోలేదని తెలుస్తున్నది. తాను జైలుకు వెళ్లడం వల్ల తన రాజకీయ భవిష్యత్తు బాగుపడుతుంది కాబట్టి, నాలుగైదు నెలలు జైలులో ఉండడం తనకేమీ కష్టం కాదని జగన్ వాదిస్తున్నాడట.

ఇదిట్లా ఉంటే మాట్రిక్స్ ప్రసాద్ అరెస్ట్, పారిశ్రామిక వర్గాలలో తీవ్ర సంచలనం రేపింది. జగన్ కేసులతో సంబంధం ఉన్న పారిశ్రామికులకు నిద్ర పట్టడం లేదు. భయంతో గజగజ వణుకుతున్నారు వారు. ఏమి పాపం చేశామని మాకీ శిక్ష అని ఆవేదన చెందుతున్నారు. తమకింత ఆపద ముంచుకొస్తుంటే జగన్ ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నది వారి ఆవేదన. జగన్‌తో పాటుగా కెవిపి రామచంద్రరావు మీద కూడా వీరు భగ్గున మండి పడుతున్నారు. వైఎస్ హయాంలో తమను పీడించి, వేధించి, బెదరించి, వ్యాపారాలను ఇరకాటంలో పెట్టి మూటలు మూటల సొమ్ము వసూలు చేసిన కెవిపి రామచంద్రరావు ఇప్పుడు తనకేమీ పట్టనట్లు వ్యవహరించడం వారిని తీవ్ర ఆవేదనకు గురి చేస్తున్నది. జైలు జీవితం ఎంత దుర్భరమో తలచుకొని తల్లడిల్లి పోతున్నారు వారంతా.



కొత్తూరులో కంటి ఆపరేషన్లు చేయించుకొన్న వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తున్న నెల్లూరు పార్లమెంటు స్థానం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తిక్కవరపు సుబ్బరామిరెడ్డి.

జాతీయ ప్రాధాన్యత

16వ పేజీ కొరవ

వరకు సుబ్బరామిరెడ్డి గారు చాలా ముందంజలో వున్నారు. పిసిసి అధ్యక్షుడు బొత్స సత్తిబాబు వచ్చి వెళ్లారు. ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆత్మకూరు, వింజమూరు బహిరంగ సభలలో మాట్లాడడంతో పాటు, నెల్లూరులో మేధావుల సమావేశం నిర్వహించి, సహకారం అభ్యర్థించారు. సినీ నటుడు చిరంజీవి వచ్చి వున్నాడు. ఆయన నాలుగైదు రోజులు ఇక్కడే వుండేట్లు వుంది. కాంగ్రెస్ అభ్యర్థి తరపున దాదాపుగా అన్ని నియోజకవర్గాలలో కార్యకర్తల సభలు జరిపేశారు. దాదాపు మూడు వందల మంది ముఖ్య కార్యకర్తలు వాహనాలు సమకూర్చుకొని, పూర్తికాలం గ్రామాలలో తిరుగుతున్నారు. సుబ్బరామిరెడ్డి దానధర్మాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలను వివరించే రంగుల కరపత్రాలను టిఎస్ఆర్ అభిమాన సంఘాల వాళ్లు వూరూరా పంచి పెడుతున్నారు. వాటిని చూసి జనం ముగ్ధులౌతున్నారు.

మేకపాటి నిశ్శబ్ద ప్రచారం

మేకపాటి రాజమోహన్‌రెడ్డి నిశ్శబ్ద ప్రచారం నడుపుతున్నాడు. కాంగ్రెస్ వలె ఆయనకు బహిరంగ సభలు నిర్వహించే స్థాయి నేతలు లేరు. అందువల్ల తానే స్వయంగా వెళ్లి, చిన్న చిన్న సమావేశాల ద్వారా జనాన్ని పలకరిస్తున్నారు. వైఎస్.జగన్ నెలాఖరులో నెల్లూరు ప్రచారానికి రావల్సి వుంది. అప్పటికి ఆయన మీద సిబిఐ కేసులు ఏ రూపం ధరిస్తాయో తెలియదు. ఒకవేళ 28తేది ఆయన్ను అరెస్టు చేయడం జరిగితే, బహుశా జగన్ ప్రచారం నెల్లూరులో పెద్దగా వుండక పోవచ్చు. అయితే జగన్‌ను అరెస్టు చేయడమంటూ జరిగితే, దానిపై ప్రజలలో వెల్లువెత్తే సానుభూతి, జగన్ స్వయంగా వచ్చి చేసే ప్రచారం కంటే ఎన్నోరెట్లు అధికమని వైఎస్ఆర్ కాంగ్రెస్‌వాదుల భావన. నిజం చెప్పాలంటే, జగన్‌ను అరెస్టు చేయాలని కోరుతున్నారు.

నెల్లూరుముచ్చట్లు

3వ పేజీ కొరవ

అల్లూరులో 50 పడకల ఆస్పత్రి!

అల్లూరులో 50 పడకల ప్రభుత్వాస్పత్రి ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఉపఎన్నికల తర్వాత ఈ పనులు మొదలు పెడతారు. ఆస్పత్రి నిర్మాణం, వసతుల కల్పనకు ఏడు కోట్ల రూపాయలు, అవసరమైన సిబ్బందిని నియమించడానికి ప్రభుత్వం ఒప్పుకొంది. అల్లూరులో 50ఏళ్లుగా ప్రభుత్వాస్పత్రి వుంది. ఇన్నాళ్లకు 50 పడకల ఆస్పత్రిగా మారడం వెనుక బీద సోదరుల కృషి వుందనవచ్చు.

జనవాణి

2వ పేజీ కొరవ

రుకు ఎప్పటికి వస్తారో? అప్పటివరకు ప్రజాపక్షం 'జమీన్‌రైతు' పత్రికనే. ఏదో రోజు 'లీగల్ మాఫియా' నాయకుని పాపం పండుతుంది. నిఖార్సుగా వార్తలు వ్రాసే మీ ధైర్యానికి అభినందనలు తెలియజేస్తున్నాను.

డి.నరేంద్ర నెల్లూరు

నిరుద్యోగులతో చెలగాటం

2012 డిఎస్‌సి నోటిఫికేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఆగమేఘాల మీద విడుదల చేసింది. దరఖాస్తు గడువు ముగిసిన తర్వాత నెలల తరబడి వాయిదా వేసి మరో నోటిఫికేషన్ ఇచ్చారు. అప్లికేషన్ల గడువు పొడిగించడం లాంటి చర్యల మూలంగా అభ్యర్థులలో తీవ్రస్థాయిలో అయోమయం నెలకొనింది. రాష్ట్ర ప్రభుత్వానికి టెట్ పరీక్ష నిర్వహణ గూర్చి అంత పట్టుదల ఎందుకు? అసంబద్ధ ప్రశ్నలు ఇవ్వడం మూలంగా గందగోళ పరిస్థితిని లేవనెత్తి టెట్ క్వాలిఫై మార్కులు కులాలవారీగా వర్గీకరించి పర్సంటేజి మార్కులు ఇవ్వాలని నిర్ణయించడం మూలంగా ఏళ్ల తరబడి చదివిన విద్యార్థులు డిఎస్సీ పరీక్ష వ్రాయలేక చతికిలపడిపోవడం మూలంగా రాష్ట్ర ప్రభుత్వం సాధించిందేమిటి? ప్రభుత్వం ఒకసారి పునరాలోచించి టెట్ ద్వారానైనా, డిఎస్సీ ద్వారానైనా ఎంపిక ప్రక్రియ జరిపిస్తే బాగుంటుంది.

ఎం.శ్రీధర్ నెల్లూరు


గవర్నర్ నరసింహన్ ప్రజాపక్షపాతి!

రాష్ట్ర గవర్నర్‌గా రెండవ దఫా నియమితులైన ఇఎస్ఎల్ నరసింహన్‌కు అభినందనలు. క్లిష్ట సమయంలో గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన నరసింహన్ రాష్ట్రంలో ప్రశాంత పరిస్థితులు నెలకొనేలా ఎంతో కృషి చేశారు. రాష్ట్ర ప్రథమ పౌరునిగా రాష్ట్ర ప్రజల సంక్షేమం గూర్చి ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు ఎన్నో సూచనలిచ్చారు. గతంలో పనిచేసిన గవర్నర్ల కంటే భిన్నంగా క్రియాశీలంగా వ్యవహరిస్తున్న నరసింహన్ ప్రజాపక్షపాతి. ఆయనకు నా అభినందనలు.

ఎస్.బాబూరావు కావలి

పదరంగం -15

నిర్వహణ : బాబాజీ



అడ్డం

1. ఓంకారం (3)
3. ఇంగ్లీషులో రా (1)
4. సత్తువ (చేనుకా?) (2)
7. రుచి (2)
8. పాడటం (4)
9. టీచింగ్ (3)
10. తప్పక ఆచరించ వలసిన పని (4)
12. యుగం (2)
13. గోచీ (3)
16. ఇంగ్లీషు చెట్టు (1)
18. అల్లుడు (3)
19. ప్లేయింగ్ కార్డు (2)
20. కరకంకణాల దొంతర (6)
23. తక్కెడ (3)
24. మాట (2)
25. ఒట్టు, ప్రమాణం (2)
27. కవిత్వం చెప్పు వాడు (2)
30. పారితోషికం (4)
32. కలసి బ్రతకడం (6)
33. సల్ఫర్ (3)

నిలువు

1. శిష్యుని శిష్యుడు (4)
2. మోసం చేసే కళ (5)
4. మత్స్యం (2)
5. పిక్నిక్ (5)
6. ఇబ్బంది (3)
8. వేషధారణ, మేకప్ (3)
11. వరి (2)
13. యవ్వనం (3)
14. ఎండ్రకాయ (2)
15. రామలింగకవి (5)
17. లాలిపాట (2)
18. ఒక (సినీ) కవి (3)
20. ముద్దుగా పెంపకం (3)
21. టాటా – డొకోమో సింబల్ బొమ్మ(లు) (2)
22. బాధ్యతతో పాటిది (2)
24. ఎడమ భాగం (4)
26. క్రొత్త (2)
27. బంగారం (3)
28. ప్రతిభ (2)
29. సర్దుబాటు (2)
31. హత్య (2)

సమాధానాలు

పదరంగం -14

1నీ	రా	2జ	నం		3ఊ	4క		5మా	రు	6తి
ల		న		7త	రు	ణం		న		థి
కం		8వా	క్సు	ద్ది				ధ		
రు		క్ష్యం		9నం	10ద	నం	ద	ను	డు	
11డు	మ్మా				బ			డు		12సూ
			13ప్ర	వ	ర		14ప్ర		15ఆ	ర్య
16జ	న	17శ్రు	తి				18యౌ	జ	నం	
న		19తి	న	20గ	తి	న	గ		21దం	డి
త		ల		రి			22ము	23ఖం		
	24మా	య	ల	మ	25రా	ఠి		26దం	27బా	లు
28పా	ట	లు			29ఖి	30లా	డి		31ట	32పా

సంక్షిప్త సింహపురి

ఉచిత ఖత్నాకు విశేష స్పందన!

నెల్లూరు మూలపేటలోని ప్రజా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంత పేటలోని ఓబయ్య బడిలో 'ఉచిత ఖత్నా'(ఒడుగుల) కార్యక్రమం జరిగింది. 93 మంది చిన్నారులకు ఖత్నా చేశారు. వీరందరికీ మందులు, ఖత్నాగుడ్డ, గోధుమలు, చక్కెర ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్మైల్ డెంటల్ క్లినిక్ అధినేత డాక్టర్ జి.కిరణ్, ఇంజనీర్ ఆసిఫ్ విచ్చేశారు. డాక్టర్ జి.కిరణ్ మాట్లాడుతూ ఇటువంటి ప్రజాహిత కార్యక్ర మాల్లో పాలుపంచుకోవడం సంతోషంగా ఉందని, స్మైల్ డెంటల్ క్లినిక్ ద్వారా నిర్వహిస్తున్న ఉచిత దంత వైద్య శిబిరాలను ముస్లిం సోదరులు వినియోగించుకోమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సంతపేట శాఖ కార్య దర్శి షేక్ మున్నా, షేక్ రియాజ్, ప్రభాకర్, శంకర్, జలీల్, గిరి, రాధాకృష్ణ, సందాని, రహమత్ పాల్గొన్నారు.

జగన్... ఓ లీడర్!

జగన్‌లో నాయకత్వ లక్షణాలు ఉండబట్టే ఆయన వెంట నడుస్తున్నట్లు మాజీ ఎమ్పీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి చెప్పారు. వైకాపా నెల్లూరు నగర, రూరల్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాం గ్రెస్ పార్టీని రాష్ట్రంలో రెండుసార్లు అధికారంలోకి తెచ్చిన మహా నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేరు సిబిఐ ఛార్జిషీట్‌లో పెట్టడాన్ని నిరసిస్తూ ఎమ్పీ పదవి నుండి వైదొలిగానన్నారు. వైఎస్‌పై అభిమానం, జగన్ వెంట నడుస్తూ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్పీగా కొనసాగడం ఇష్టం లేక పదవికి రాజీనామా చేసినట్లు ఆయన స్పష్టం చేశారు. ఎన్నికలు ఎవరో తెస్తేరాలేదు. వైఎస్‌ఆర్‌పై పడ్డ మచ్చతోనే ఉప ఎన్నికలు వచ్చాయన్నారు. ఈ సమావే శంలో కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఆనం వెంకటరమణారెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, అబ్దుల్ అజీజ్, పాపకన్ను రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ జైలు తనిఖీ

నెల్లూరు సెంట్రల్ జైలులో గతవారం ఖైదీల నిరసన దీక్షా నేపథ్యంలో రాయలసీమ జైళ్ల డిఐజి జి.జయవర్ధన్ తనిఖీ చేశారు. అనంతరం అధికా రులపై వచ్చిన ఆరోపణలు, ఖైదీలు, అధికారులకు మధ్య జరిగిన ఘర్షణ లపై విచారణ జరిపారు. ఖైదీల పట్ల జైలు అధికారులు ప్రవర్తిస్తున్న కఠిన వైఖరి గూర్చి ఆరా తీశారు. ఖైదీలు ఎదుర్కొంటున్న సమస్యలను వారి నుంచే అడిగి తెలుసుకొన్నారు. అనంతరం జైలు అధికారులను మందలించినట్లు తెలిసింది. డిఐజి వెంట జైలు సూపరింటెండెంట్ నాగేశ్వరరావు, డిప్యూటీ సూపరింటెండెంట్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు జాగ్రత్తగా నిర్వహించండి!

ఉప ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు, నేతల కదలికలపై నిత్యం నిఘా ఉంచి వారు అడ్డదారులు తొక్కకుండా చూడాలని కేంద్ర ఎన్నికల సంఘం డైరక్టర్ జనరల్ పి.కె.దాస్ ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధి కారి భన్వర్‌లాల్‌తో కలసి ఆయన జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే ప్రయత్నాలను కఠినంగా అడ్డు కోవాలన్నారు. గట్టి నిఘా నీడన స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాం తంగా ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా సరిహద్దులు, నియోజకవర్గ పరిధిలో విస్తృతంగా చెక్ పోస్టులు ఏర్పాటుచేసి ముమ్మర తనిఖీలు నిర్వహించి మద్యం, డబ్బు రవాణాను అరికట్టాలన్నారు. ఎస్పీ రమణకుమార్ మాట్లాడుతూ ఇప్పటివరకు పోలీసులు ఏర్పాటుచేసిన తనిఖీ కేంద్రాల వద్ద 16వేల మద్యం సీసాలను సీజ్ చేసినట్లు చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ శ్రీధర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ సౌరభ్‌గౌర్, డిఆర్వో రామిరెడ్డి, ఎఎస్పీలు చంద్రశేఖర్‌రెడ్డి, కె.నాగేశ్వరరావులు పాల్గొన్నారు.

జోనల్ అధికారులకు శిక్షణ



శిక్షణనిస్తున్న జాయింట్ కలెక్టర్ సౌరభ్ గౌర్.

ఉప ఎన్నికల నిర్వ హణ విధుల్లో పాల్గొనే జోనల్ అధికారులకు రెండు రోజులపాటు శిక్షణ కార్యక్రమాలు జరిగాయి. జిల్లా ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న కలెక్టర్ బి.శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమం జరి గింది. నియోజకవర్గాల వారీగా నియమించిన అధికారులకు నెల్లూరు పాలి టెక్నిక్ కళాశాల, కనుపర్తిపాడు సమీపంలో ఉన్న ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఎన్నికల నిర్వ హణలో ఎటువంటి ఇబ్బంది లేకుండా ముందుగానే అన్నీ ఏర్పాటు చేసు కోవాలని కలెక్టర్ కోరారు. జెసి సౌరభ్‌గౌర్, నెల్లూరు ఆర్డీఓ మాధవీలత, రూట్ ఆఫీసర్లు, ప్రిసైడింగ్ ఆఫీసర్లు, ఇతర సిబ్బందికి మరో మారు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయాలని జోనల్ అధికారులకు ఆయన సూచించారు.

మటన్, చికెన్ మంచివి అమ్మాలి!

నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలోని చికెన్, మటన్ స్టాల్స్ నిర్వాహకులు తప్పనిసరిగా గ్లాస్ బాక్సులు అమర్చుకొని మంచి మటన్, చికెన్ విక్రయాలు చేయాలని అదనపు జాయింట్ కలెక్టర్ లక్ష్మీకాంతం ఆదేశించారు. డైకస్‌రోడ్డులోని మాంసం మార్కెట్‌లో తనిఖీలు చేసిన ఆయన మాట్లాడుతూ చికెన్, మటన్ విక్రయాలు చేస్తున్న షాపుల వారికి లైసెన్సులు తప్పనిసరిగా ఉండాలని, లేనివాటిని మూయిస్తామన్నారు. గ్లాస్ బాక్సులు ఏర్పాటు చేయించే బాధ్యత శానిటరీ ఇన్స్‌పెక్టర్లదేనన్నారు. దీనికి విరుద్ధంగా వ్యవహరించే వారిపై 1939 చట్టం ప్రకారం చర్యలు తప్పవ న్నారు. ఓ జిల్లా అధికారి మటన్ మార్కెట్‌కు వెళ్లి పరిశీలించడం అభినంద నీయం. మార్కెట్‌లో గ్లాస్ బాక్సులకన్నా కల్తీ మటన్, చికెన్ అమ్మకాలను నిరోధించేలా చర్యలు అవసరం ఎజెసి గారు.



రైతు లోకం

వేరుశనగలో ఆకుముడత తెగులు - నివారణ చర్యలు!

ఖరీఫ్‌లో వరి తర్వాత అంతటి ప్రాధా న్యం వేరుశనగ పంటకు వుంటుంది. ఇప్పుడది నెల పంటగా పలు చోట్ల వేరుశనగ సాగవుతోంది. ఎండ తీవ్రత ఎక్కువగా వుం డటం, అడపాదడపా పడుతున్న వర్షాలతో పలుచోట్ల తెగుళ్లు వ్యాప్తి చెందుతున్నాయి. ముఖ్యంగా ఆకుముడత వల్ల పైరు దెబ్బతినే ప్రమాదం వుంటుంది. నివారణకు సరైన జాగ్ర త్తలు పాటించాలి.

విత్తిన 15 రోజుల నుంచే ఆకు ముడత ఆశించే ప్రమాదం వుంది. ఆకులపై గోధుమ రంగు మచ్చలు ఏర్పడతాయి. వాటి లోపల ఆకుపచ్చ రంగులో నల్లని తల కలిగిన పిల్ల పురుగులు వుంటాయి.

ఇవి రెండు లేదా మూడు ఆకులను కలిపి గూడులా చేసి వాటిలోని పచ్చదనాన్ని తినడం వల్ల ఆకులు ఎండి కాలినట్లు కనిపిస్తాయి. ఈ తెగులు నియంత్రణకు జొన్న, సజ్జ, సోయ చిక్కుడు వంటి వాటిని అంతర పంటలుగా సాగు చేస్తే ప్రయోజనం వుంటుంది.

నత్రజని వాడకాన్ని పూర్తిగా తగ్గించాలి. ఎకరాకు 4 లింగాకర్షణ బుట్టలు పెట్టి మగ రెక్కలపురుగులను ఆకర్షించి చంపాలి. ఎకరా వేరుశనగ పొలంలో 30-40 ఆముదం, పొద్దు తిరుగుడు మొక్కలను ఎర పంటలుగా పెంచుకో వాలి. ఎన్‌పివి ద్రావణాన్ని సాయంత్రం వేళల్లో పిచికారి చేయాలి. ఐదు శాతం వేపగింజల కషా యాన్ని పురుగులు చిన్నవిగా వున్నప్పుడే పిచి కారి చేస్తే అవి నశిస్తాయి. పొగాకు లద్దె పురు గులు కనిపిస్తుంటే క్లోరిపైరిఫాస్ 500 మిల్లీ లీటర్లు, అరకిలో బెల్లం, వరి తవుడు 5 కిలోలు, తగినంత నీరు కలిపి చిన్న చిన్న విషపు ఎర వుండలను తయారుచేసి ఎకరా పొలంలో

డాక్టర్ ఎం.రవీంద్రకుమార్ రెడ్డి,
ప్రధాన శాస్త్రవేత్త & కోఆర్డినేటర్,
ఏరువాక (డాట్ సెంటర్), నెల్లూరు.

సాయంత్రం వేళ మొక్కల మొదళ్ల వద్ద పడేలా జారవిడవాలి. మొక్కల మొదళ్ల వద్ద నేలలో దాగిన లద్దె పురుగులు చీకటిపడగానే బయటకి వచ్చి విషపు ఎర వుండలను తిని చనిపోతాయి.

Regn.No. : RN 1156 / 57 J/Nellore/008/12-14

సుబ్బరామిరెడ్డి రంగప్రవేశంతో

నెల్లూరు ఎన్నికకు జాతీయ ప్రాధాన్యత!

నెల్లూరు లోక్‌సభ నియోజకవర్గం ఉప ఎన్నిక దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నది. అందుకు రెండు కారణాలు. మొదటిది – తిక్కవరపు సుబ్బరామిరెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి కావడం. రెండవది – జగన్ పార్టీ పార్లమెంట్‌కు పోటీ చేయడం ప్రధమం కావడం. గతంలో కడప ఉప ఎన్నిక జరిగినా, వైఎస్ కుమారుడిగా, వైఎస్ స్వంత జిల్లాలో వైఎస్ మరణం తర్వాత పోటీ కాబట్టి, అది లెక్కలోకి రాదు. నెల్లూరులో జరుగుతున్నదే నిజమైన పరీక్ష.

సుబ్బరామిరెడ్డి వ్యక్తిత్వం అందరినీ ఆకర్షిస్తున్నది

తిక్కవరపు సుబ్బరామిరెడ్డి, జాతీయ స్థాయి నేత. సోనియాగాంధీతో సహా కాంగ్రెస్ అగ్రనేత లందరితో భుజం భుజం కలిపి పని చేస్తున్న నాయకుడు. ఆయన కేవలం రాజకీయ వాది కాదు. అంతకంటే అధికంగా దాన గుణంలో అభినవ దాన కర్ణుడు. పారిశ్రామికవేత్త. కళా ప్రియుడు. ఆధ్యాత్మిక రంగంలో లబ్ద ప్రతిష్టుడు. స్వయంగా లక్షలాది మందితో శివ పూజ చేయించేస్థాయి దైవ భక్తుడు. దేశ భక్తితో, లాభాపేక్ష లేకుండా స్వామి వివేకానంద, భగవద్గీత వంటి అద్భుతమైన సినిమాలను నిర్మించిన గొప్ప మనిషి. తన సంపాదనలో అధిక భాగాన్ని ధర్మ కార్యాలకు, ప్రజలకుపయోగపడే సంస్థల స్థాపనకు, శాశ్వత భవనాల నిర్మాణానికి వినియోగిస్తున్న ఆదర్శవాది. అన్నిటికీ మించి మనసున్న మంచి మనిషి. పేద, గొప్ప అనే తారతమ్యం లేకుండా అందరినీ సమభావంతో పలకరించి, వారి సమస్యలు తీర్చడానికి ప్రయత్నం చేసే ఉదార స్వభావులు. ఇన్ని లక్షణాలు ఒక మనిషిలో కేంద్రీకృతం కావడం చాలా అరుదైన విషయం. అటువంటి అరుదైన నేత ఇక్కడ జరిగే పార్లమెంటు ఉప ఎన్నికలో అభ్యర్థిగా రావడంతో, కాంగ్రెస్ కార్యకర్తలతో పాటు సాధారణ జనంలో కూడా విపరీతమైన ఆసక్తి జనిస్తున్నది. ఒక ఉత్సాహం, వూపు వెల్లి విరుస్తున్నాయి. కొంత అతిశయోక్తిగా కన్పించవచ్చు కానీ, కాంగ్రెస్ పార్టీ కంటే సుబ్బరామిరెడ్డి వ్యక్తిత్వం ఈ ఎన్నికలో ప్రజల ముందుకు వెళ్తున్నది. దాని ఆధారంగానే ఎన్నిక జరిగే పరిస్థితి కన్పిస్తున్నది. ఆయన బదలు మరెవ్వరు అభ్యర్థి అయివుండినా కాంగ్రెస్‌కు ఈ వూపు, ఉత్సాహం వుండేవి కావనడం ఎవరూ కాదనలేని నిజం.

కాంగ్రెస్‌లో అపూర్వ ఐక్యత

దానికి సంకేతంగా నియోజకవర్గం మొత్తం మీద కాంగ్రెస్‌వాదులందరూ కలిసి కట్టుగా కదన రంగంలోకి దూకారు. ఆనం సోదరుల పెత్తనంపై అధిక భాగం కాంగ్రెస్‌వాదులలో అయిష్టత, అసంతృప్తి వున్నప్పటికీ, సుబ్బరామిరెడ్డికి నష్టం జరగకూడదనే భావనతో అన్ని వర్గాల వారూ కలిసి వస్తున్నారు. కాంగ్రెస్‌కు ఇదొక శుభ పరిణామం. ఇటీవలికాలంలో ఆ పార్టీలో అంతటి ఐక్యత చూడలేదు.

జగన్ మోజుకూ విరామం

జనంలో, మరీ ముఖ్యంగా రెడ్డి కులస్తులలో వైఎస్.జగన్ పట్ల ఎంత మోజు వున్నదీ ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఒక రకంగా చెప్పాలంటే ఉన్మాద స్థాయిలో వుంది అది. పెళ్లాం చెప్పినా మొగుడు, మొగుడు చెప్పినా పెళ్లాం విన్పించుకోని పరిస్థితులున్నాయి. అయితే సుబ్బరామిరెడ్డి అభ్యర్థి అనడంతోనే ఈ ఉధృతిలో కొంత మార్పు కన్పిస్తున్నది. మొన్నటికి మొన్న కోవూరు ఉప ఎన్నికలలో జగన్ జెండా మోసినవారు కూడా, తాత్కాలికంగా జగన్ మోజుకు విరామం ప్రకటించి, కాంగ్రెస్‌తో చేతులు కలుపుతున్నారు. చాలా గ్రామాలలో స్థానిక నాయకత్వం స్వచ్ఛందంగా సుబ్బరామిరెడ్డి పక్షం చేరుతున్నది. బుచ్చిరెడ్డిపాళెం, కోవూరు, ఇందుకూరుపేట, అల్లూరు, కావలి వంటి మండలాలలో ఈ వలసలు అధికంగా వున్నాయి.

మేకపాటి ఉక్కిరి బిక్కిరి

ఈ పరిణామాలు జగన్ పార్టీ అభ్యర్థి మేకపాటి రాజమోహన్‌రెడ్డిని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. చాలా ఆశలతో ఈ ఎన్నికలకు సిద్ధమైనాడాయన. తన గెలుపు నల్లేరు మీద బండి నడక కంటే సునాయాసమనే అంచనాతో పాటు, కడపలో జగన్ వలె భారీ మెజార్టీ సాధించి, రికార్డు సృష్టిస్తాననే ఆశ వుండిందాయనకు. సుబ్బరామిరెడ్డి రంగ ప్రవేశంతో అది కాస్తా తారుమారై పోయింది. మెజార్టీ సంగతి దేముడెరుగు, ముందు గెలుపు సంగతి చూసుకొందామనే వ్యూహానికి వచ్చారాయన. మూలిగే నక్క మీద తాటి పండు పడినట్లు స్వంత పార్టీలో అసమ్మతి జ్వాలలు భగ్గుమంటున్నాయి. దాదాపుగా ఆ పార్టీలో వున్న నాయకులందరూ ఏదో ఒక నెపంతో అలుక పాన్పులు ఎక్కి వున్నారు. అయితే మేకపాటి స్థాయి, జగన్‌తో ఆయనకున్న సాన్నిహిత్యం దృష్ట్యా మనసులో కుమిలి పోవడం తప్ప, బయటకు వ్యక్తం చేయలేని బలహీనతతో మధన పడుతున్నారు. నియోజకవర్గానికి ఇన్‌ఛార్జీలుగా పని చేసే స్థాయి నాయకులే అంటీ ముట్టనట్లు ప్రవర్తిస్తే, ఇక ఎన్నికలలో గట్టెక్కేదెట్లా? ఆ కొరత తీర్చుకోవడం కోసం మేకపాటి కుటుంబం మొత్తం రంగంలోకి దిగిపోయింది. అహోరాత్రులు అదే పనిలో వున్నారు వారు. స్థానిక నాయకత్వంతో సంబంధం లేకుండా జగన్ అభిమానులను, ఇతర పార్టీల నుంచి వలస వచ్చే వారిని నేరుగా సంప్రదించి, తమ జట్టులో చేర్చుకొంటున్నారు. వారికి నేరుగా వనరులు సమకూరుస్తున్నారు. అలవాటుకు భిన్నంగా డబ్బు దస్కం ధారాళంగా వదలుతున్నారు. గ్రామం, వార్డు స్థాయిలో సర్వేలు జరిపిస్తున్నారు. పెద్ద బృందమే నెల్లూరులో దిగి వుంది ఈ సర్వేల కోసం.



తిక్కవరపు సుబ్బరామిరెడ్డి స్వంత మండలం ఇందుకూరుపేట కొత్తూరు గ్రామంలో జరిగిన సభలో మాట్లాడుతున్న పారిశ్రామికవేత్త జివికె.రెడ్డి. వేదికపై టిఎస్ఆర్, మంత్రి రామనారాయణరెడ్డి, మాదాసు గంగాధరం, సర్వేపల్లి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యేలు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి.

జగన్‌కు ఫిర్యాదులు

ఇదిల్లా వుంటే, రాజమోహన్‌రెడ్డి తీరు తమకు నచ్చడం లేదని నెల్లూరు జిల్లాకు చెందిన పలువురు వైఎస్ఆర్ కాంగ్రెస్ నేతలు జగన్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తున్నది. అయితే దానిపై జగన్ పెద్దగా స్పందన చూపినట్లు లేదు. ఆ పార్టీ రాష్ట్ర నేతలు జోక్యం చేసుకొని, సర్దుబాటు మాటలు చెప్పి పంపే శారట. ఎందుకైనా మంచిదని వైవి.సుబ్బారెడ్డి నెల్లూరు వచ్చి, రెండు రోజులు మకాం పెట్టి, అందరినీ బుజ్జగించి వెళ్లాడు.

అయ్యో పాపం వంటేరు

రెండు పోట్ల గిత్తల మధ్య లేగ దూడ దూరితే ఏమౌతుందో, తెలుగుదేశం అభ్యర్థి వంటేరు వేణుగోపాలరెడ్డిని చూస్తే అర్థమౌతుంది. తతిమా రెండు పార్టీలలో ఆంబోతుల వంటి అభ్యర్థులుండడంతో, ఆయన బిక్క చచ్చిపోతున్నాడు. ఏ విషయంలోనూ వారితో పోటీ పడలేక పోతున్నాడు.

కమ్మ కులంలో మధనం

ఇదిట్లా వుంటే, తెలుగుదేశానికి ఓటు బ్యాంకు వంటి కమ్మ కులంలో తీవ్రమైన మధనం జరుగుతున్నట్లు తెలుస్తున్నది. ఆ పార్టీ అభ్యర్థి పోటీలో వున్నాడు కాబట్టి, వారు సహజంగా దాని వైపే మొగ్గాలి. కానీ దానివల్ల లాభమెంత, నష్ట మెంత అన్న ఆలోచన జరుగుతున్నది. తెలుగుదేశానికి ప్రధాన శత్రువు వైఎస్.జగన్. ఈ ఎన్నిక జగన్‌కు ప్రాణ వాయువు వంటిది. నెల్లూరు లోక్‌సభలో గెలిస్తే ఆయన పేరు ఢిల్లీలో మారు మ్రోగిపోతుంది. ఆ ప్రభావం రేపటి సాధారణ ఎన్నికలలో కూడా వుంటుంది. ఇప్పటి ఎన్నికలో తెలుగుదేశం పోటీ నామమాత్రమన్న నిజం ఎవరైనా అంగీకరించాలి. అటువంటి పార్టీకి ఓటు వేసి, ఓటు వృధా చేసుకొనే కంటే, ఈ ఎన్నిక వరకు తమ ఓట్లు కాంగ్రెస్‌కు వేసి, జగన్‌ను ఈ దశలోనే అడ్డుకొంటే తమ సామాజిక వర్గం మొత్తానికి దీర్ఘకాలిక ప్రయోజనాలు సిద్ధిస్తాయని వారు ఆలోచన చేస్తున్నారు. నెల్లూరు లోక్‌సభ నియోజకవర్గంలో దాదాపు లక్షా 30 వేల మంది కమ్మ ఓటర్లు వున్నారు. వారిలో ఏ 30 లేదా 40 శాతం మంది ఈ ఆలోచనకు ప్రభావితులైనా ఫలితం తారు మారు కావడం సహజం.

ప్రచారంలోనూ ముందంజ

ఎన్నికల ప్రచార నిర్వహణలోను ఇప్పటి

కొరవ 14వ పేజీలో

కార్టూన్ స్పేస్



ఉప ఎన్నికలే కదా... రిగ్గింగ్ చేయడానికి మా అబ్బాయిని పంపిస్తా సార్...!

Imported & Indian Furniture
మా ప్రత్యేకత
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
ఆదివారం కూడా షాపు తెరవబడును.

Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore. E-mail : jaminryot@yahoo.com